సత్వరమే డి-అడిక్షన్ వార్డు ఏర్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సత్వరమే డి-అడిక్షన్ వార్డును ఏర్పాటు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో నాకోర్డు జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ జగదీశ్, సహాయ కలెక్టర్ వినూత్నతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు ఉపయోగం లేకుండా చూడాలన్నారు. ప్రతి చోటా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన సభలు పెట్టాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసగా మారడం, వాటి బారిన పడిన వారికి వైద్య చికిత్స అందించేందుకు డి-అడిక్షన్ వార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇప్పటికే కర్నూలు వంటి ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. తగిన వసతి కల్పించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ చూసుకోవాలన్నారు. గుంతకల్లు రైల్వే, ఐటీఐ, పాలిటెక్నిక్, జేఎన్‌టీయూ కళాశాల్లో, వసతి గృహాలపై నిరంతరం నిఘా ఉండాలన్నారు.

17,509 క్వింటాళ్లు పప్పుసెనగ పంపిణీ

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : జిల్లాలో రాయితీ పప్పుసెనగ పంపిణీ కొనసాగుతోంది. శుక్రవారం నాటికి మొత్తం 10,984 మంది రైతులకు 17,509 క్వింటాళ్లు పంపిణీ చేశామని ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఇప్పటివరకు 19,465 క్వింటాళ్లు విత్తనం కావాలని 13,832 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. జిల్లాకు 27, 907 క్వింటాళ్లు కేటాయించడం జరిగిందని డీఏవో తెలిపారు.

ఖాద్రీశా..
- కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం
- ఆలయ పరిసరాల్లో ఆక్రమణలు

వరద ముప్పు తప్పేనా?



ఆలయ ముందు భాగంలో ఉత్తరం వైపు ఆక్రమణకు గురైన కాలువ

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దక్షిణ భారతావనిలో ఎంతో ప్రాశస్త్యం ఉంది. వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిగా భక్తజనం వచ్చి స్వామిని దర్శించుకుంటూ ఉంటారు. భక్తుల కొంగు బంగారమైన స్వామి.. ఏటా కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరే క్షేత్రానికి వరద ముప్పు పొంచి ఉంది. దీనికి కారణం అధికార యంత్రాంగం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరే. భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ఆలయంలోకి వరద నీరు ప్రవేశిస్తున్నా.. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. గురువారం రాత్రి ఆలయంలోకి వరద రావడంతో భక్తులు పడరాని పాట్లు పడ్డారు. మోస్తరు నుంచి భారీ వాన వస్తే చాలు ఇదే పరిస్థితి తలెత్తుతున్నా పాలకవర్గం, అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఆలయ పరిసరాల్లోని కాలువలు పూడిక పేరుకుపోయి తరచూ స్తంభించిపోతున్నా వాటి నిర్వహణ కరవైంది. మరోవైపు ఆక్రమణలకు గురికావడంతో పరిస్థితి మరింత జఠిలంగా మారుతోంది. ఇదిలా ఉండగా సీసీ రోడ్డు నిర్మాణం ఆలయం వైపు వాలుగా ఉండటంతో వరద లోనికి వెళుతోంది.



ఖాద్రీశుని ఆలయం

ఏటా ఆదాయం: సుమారు రూ.13 కోట్లు
నిత్యం సందర్శించే భక్తులు: దాదాపు 6 వేలు
ప్రత్యేక రోజుల్లో..: 15 వేల నుంచి 20 వేల మంది వరకు

తూర్పు గోపురం నుంచి..

తూర్పు గోపురం ముందున్న ధ్వజస్తంభానికి సమీపాన కాలువ రూపు కోల్పోయింది. గోపురం ముందు ఉత్తరం వైపు నుంచి మురుగు, వర్షపునీరు వెళ్లేందుకు నిర్మించినా ఆక్రమణలకు గురైంది. మోస్తరు నుంచి భారీ వర్షం వస్తే తూర్పు గోపురం గుండా వరద నీరు ఆలయంలోకి వెళ్తోంది. ఆవరణ నుంచి పడమర గోపురం దిశగా వరద బయటికి వస్తుంది. ఆక్రమణలు తొలగించడం, కాలువను విస్తరించడం.. వారానికి ఒకటి, రెండు సార్లైనా పూడిక మట్టి తొలగించి.. పకడ్బందీగా నిర్వహణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు పేర్కొంటున్నారు.



తూర్పు గోపురం ముందు వరద నీరు వెళ్లాల్సిన కాలువ తీరు ఇలా..

శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ అధికారుల సమన్వయంతో వరద నీరు ఆలయంలోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇంజినీర్లతో చర్చించాం. ఆక్రమణలు తొలగించి వరద సమస్య లేకుండా శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. - శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో

మాటలతో బురిడీ.. గుట్టులాగి దోపిడీ

- వ్యూహాలు మారుస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, అనంత నేరవార్తలు

ఆత్యాశ, బలహీనతలను ఆసరాగా తీసుకుని సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారు. స్టాక్ మార్కెట్, డిజిటల్ అరెస్టు, పార్శిల్ కొరియర్ వంటి పేర్లతో పలువురిని మోసగించి రూ.లక్షలు కాజేస్తున్నారు. ధర్మవరం పట్టణానికి చెందిన వైద్యుడి నుంచి డిజిటల్ అరెస్టు పేరుతో రూ.30 లక్షలు నొక్కేయడం కలకలం రేపింది. అవగాహన ఉన్న వైద్యుడినే బురిడీ కొట్టించారంటే ఇక అమాయకుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరస్తుల బాధితుల్లో కొందరే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతికి చెందిన చాలామంది పరువు పోతుందోనని బయటకు చెప్పుకోలేకపోతున్నారు. ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు.

హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులే లక్ష్యం

చాలామంది తల్లిదండ్రులు పిల్లలను హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ ప్రాంతాల్లో చదివిస్తున్నారు. తాము ఫలానా పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని.. మీ అబ్బాయి కొంతమందితో కలిసి గంజాయితో దొరికిపోయాడని తల్లిదండ్రులకు ఫోన్ చేస్తారు. కేసు నుంచి తప్పించాలంటే తమకు డబ్బులు పంపించాలని డిమాండ్ చేస్తారు.


వర్చువల్ ఫోన్ నంబర్లతో..

బెదిరింపులకు పాల్పడే నేరస్తులు వర్చువల్ నంబర్లను వినియోగిస్తున్నారు. ప్రత్యేక యాప్‌ల ద్వారా సంబంధం లేని ఫోన్ నంబరు సంపాదించి, ఆ నంబను నుంచి వాట్సప్ కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వర్చువల్ నంబర్ల ద్వారా ఫోన్ చేసిన వారిని పట్టుకోవడం కష్టమవుతోందని సైబర్ పోలీసులు చెబుతున్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో..

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో ఉన్నవారితోపాటు వ్యాపారాలు చేసేవారు సైతం స్టాక్‌మార్కెట్‌లో ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న సైబర్ దొంగలు మోసాలకు తెరతీస్తున్నారు. రోజుకో యాప్ తీసుకొచ్చి ట్రేడింగ్ పేరుతో ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. బోనస్ ఇస్తామని, కొంత మొత్తంలో లాభాలు ఇచ్చి ఆశ పెంచుతున్నారు. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టే సరికి మొత్తం లాగేసుకొని పత్తాలేకుండా పోతున్నారు. ఇలా కదిరికి చెందిన ఓ వ్యక్తి ఒకేరోజు రూ.18 లక్షలు పోగొట్టుకున్నాడు.





అప్రమత్తతే శ్రీరామరక్ష

- జగదీశ్, ఎస్పీ, అనంతపురం

అపరిచిత వ్యక్తుల నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దు. టెలిగ్రామ్, వాట్సప్‌లో వచ్చే తెలియని లింకులపై క్లిక్ చేస్తే సైబర్ దొంగల వలలో చిక్కుకునే ప్రమాదం ఉంది. ఇటీవల డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బులు లాగేస్తున్నారు. ఒకవేళ ఇలా ఎవరైనా ఫోన్ చేస్తే సైబర్ విభాగ పోలీసులకు ఫిర్యాదు చేయండి.

- అనంతపురానికి చెందిన దంపతుల కుమారుడు అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడు. వారం కిందట ఓ వ్యక్తి అమెరికా సీరీస్ ఫోన్ నంబరుతో తండ్రికి వాట్సాప్ కాల్ చేశాడు. మీ కుమారుడు ఇక్కడ రోడ్డు ప్రమాదానికి కారణమయ్యాడు. అతన్ని అరెస్టు చేశాం. 50 వేల డాలర్లు పంపితే విడుదల చేస్తామన్నారు. తండ్రి కుమారుడి ఫోన్ చేయడానికి ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కంగారుపడిన కుటుంబసభ్యులు 50 వేలడాలర్లు (రూ.40 లక్షలు) ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎందుకైనా మంచిదని తండ్రి సైబర్ క్రైబ్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నేరగాళ్ల పని అని తేలింది.

- అనంతపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఓ వ్యక్తి స్టాక్ మార్కెట్‌లో అడపాదడపా పెట్టుబడి పెట్టేవాడు. రెండు రోజుల కిందట ఓ యాప్‌లో ఎక్కువ డబ్బులు వస్తాయని తెలిసి అందులో పెట్టుబడి పెట్టాడు. మొదట రూ.50 వేలు లాభం వచ్చింది. 3 గంటల వ్యవధిలోనే రూ.1.50 లక్షల వరకు లాభం వచ్చింది. ఆశపడి ఒకేసారి రూ.12 లక్షలు పెట్టేశారు. మొత్తం నష్టపోయినట్లు సందేశం వచ్చింది.

- హిందూపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ యువతికి అపరిచిత నంబరు నుంచి ఫోన్ వచ్చింది. "మేం ముంబయి సీటీ పోలీసులం. మీ ఆధార్ నంబరుతో లింకైన కొన్ని ఫోన్ నంబర్లను వివిధ నేరాల్లో వినియోగించారు. డ్రగ్స్, హవాలా వంటి నేరాలకు సంబంధించి మీ ఆధార్ నంబరు చూపిస్తోంది. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం. విచారణకు సహకరించండి. లేదంటే మా పోలీసులు మీ ఇంటి బయటే ఉన్నారు. వెంటనే అరెస్టు చేస్తారు" అని బెదిరించారు. యువతి గంటకుపైగా వారితో వీడియో కాల్ మాట్లాడింది. మీ బ్యాంక్ ఖాతా ట్రాక్ చేయడం కోసం రూ.3 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. డబ్బుల కోసం తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పింది. అతను పోలీసులను ఆశ్రయించగా.. సైబర్ నేరగాళ్ల పనేనని తేలింది.

లెక్కలేనన్ని రీసర్వే తప్పులు.. అవేమీ పట్టని గ్రామసభలు!

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో సాగిన భూ రీసర్వేలో భూమి సరిహద్దులు, విస్తీర్ణం, మ్యుటేషన్, డివిజన్, పేర్లు, సర్వే నంబర్లు.. ఇలా కుప్పలు తెప్పలుగా తప్పులు దొర్లాయి. భూ విస్తీర్ణం, రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, డివిజన్.. ఇలా లెక్కలేనన్నీ తప్పులు నమోదు కావడంతో అన్నదాతలు లబోదిబోమన్నారు. వీటన్నింటిని క్షేత్ర స్థాయిలో సరిదిద్దడానికి ప్రస్తుత తెదేపా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. ప్రభుత్వ ముఖ్యోద్దేశాన్ని జిల్లా 'రెవెన్యూ' యంత్రాంగం నీరుగార్చేలా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

● జిల్లాలో మొత్తం 503 గ్రామాల్లో.. మూడు విడతల్లో 198 గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. రెండో విడత వరకు భూ హక్కు పత్రాలు(పాసు పుస్తకాలు) ఇచ్చారు. అప్పట్లో బాధితులు అర్జీలు ఇచ్చినా పరిష్కారం కాలేదు. ప్రస్తుతం ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి పరిష్కరించేందుకు ఈనెల 18 నుంచి 29వ తేదీ దాకా 'గ్రామసభల నిర్వహణకు శ్రీకారం చుట్టారు.

> శింగనమల మండలం ఆకులేడు గ్రామ సభ తూతూమంత్రంగా సాగింది. ఈ గ్రామ రెవెన్యూ పొలంలోకి బీకే సముద్రం మండలం ఆర్.కొత్తూరు రైతులకు సంబంధించి 500 ఎకరాలపైగా ఉంటుంది. ఆ గ్రామ రైతులకు ఎవరికి ఆకులేడు గ్రామ సభ గురించి తెలీదు. గత ప్రభుత్వ హయాంలో సాగిన రీసర్వేలో కుప్పలుతెప్పలుగా తప్పులు దొర్లాయి. అర్జీలు ఎవరికి ఇవ్వాలో తెలీక లబోదిబోమంటున్నారు. ఇదే విషయంపై గ్రామసభలో సిబ్బందితో రైతులు వాదనకు దిగారు.

198 పల్లెల్లో ప్రచారం ఏదీ?

జిల్లాలో 503 గ్రామాలు ఉన్నా.. రీసర్వే జరిగిన 198 గ్రామాల్లో మాత్రమే సభలు పెడుతున్నారు. ఈ గ్రామ సభల నిర్వహణ, ఉద్దేశంపై ఒకటి రెండు రోజులు ముందే నిర్దేశిత గ్రామాల్లో చాటింపు వేయాలి. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి. ఉదయం ఒక గ్రామం, మధ్యాహ్నం మరొక గ్రామంలో సభలు నిర్వహించి బాధితుల నుంచి అర్జీలు తీసుకోవాలి. ఏమేమీ తప్పులు ఉన్నాయో స్పష్టంగా అర్జీ తీసుకుని పరిష్కరించాలి. కానీ అత్యధిక శాతం పంచాయతీ సర్పంచులకే సమాచారం తెలియకుండా నామమాత్రంగా చిన్నగదుల్లో సభలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు.

దండోరా వేయిస్తున్నాం...

- రూప్లానాయక్, ఏడీ, భూమి, రికార్డుల శాఖ

గ్రామసభల నిర్వహణపై ఒక రోజు ముందే దండోరా వేయిస్తున్నాం. ఈ బాధ్యత వీఆర్‌ఏలే చేసుకుంటున్నారు. రీసర్వే జరిగిన పల్లెల్లోనే ఈ సభలు ఉంటాయి. ఈనెల 29 దాకా అర్జీలు తీసుకుంటున్నాం. నవంబరు 15లోపు అర్జీల పరిష్కారం పూర్తి అవుతుంది.

ఈ-పంట నమోదు తుది జాబితాకు కసరత్తు

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : వారం రోజులుగా ఈ-పంట నమోదు కార్యక్రమంలో మొత్తం వ్యవసాయశాఖ ద్వారా 1500, ఉద్యాన శాఖ ద్వారా 3,480 దరఖాస్తులు వచ్చాయని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు తెలిపారు. వచ్చిన అర్జీలను రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అర్జీలన్నీ పరిష్కరించారు. సాయంత్రం 6 గంటలకు సామాజిక తనిఖీ కోసం ఇచ్చిన ఆప్షన్‌ను క్లోజ్ చేశారని ఉద్యానశాఖ డీడీ నరసింహారావు తెలియజేశారు. గత ఖరీఫ్-2014 ఈ-పంట నమోదు తుది జాబితాను ఈనెల 21న తుది జాబితా విడుదల చేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికార వర్గాలు తెలిపాయి. జిల్లాలో మొత్తం 10,54,356 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తి చేశామని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

వామ్మో జ్వరాలు!

వాతావరణ మార్పులతో విజృంభణ



అనంతపురం సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న పిల్లలు

అనంతపురం (వైద్యం), పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జ్వరబాధితులు పెరుగుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు.. వాతావరణంలో మార్పులు ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు మురుగుపారుదల వ్యవస్థ అస్తవ్యస్తం, తాగునీరు కలుషితం, పారిశుద్ధ్య లోపంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా జ్వరంతోపాటు దగ్గు, జలుబు, ఆయాసం, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరిక... తదితర లక్షణాలతో చాలా మంది చికిత్స పొందుతున్నారు. వారంలో ప్రతి శుక్రవారం వైద్యఆరోగ్య శాఖ, పురపాలక, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో డ్రైడే నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని కేవలం ఫొటోలు దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయటంతోనే సరిపెడుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్ విభాగాలలో 40 మంది జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారు.


ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..

ఇంటింటా సర్వే: ఈనెల1 నుంచి 16 వతేదీ వరకు
జ్వర బాధితుల సంఖ్య : 18,713
సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో చికిత్స పొందిన వారు: 1,684

అత్యధికంగా జ్వరం కేసులు నమోదైన ప్రాంతాలు:

అనంతపురం జిల్లా: అనంతపురంలో 379, యాడికి 174, బ్రహ్మసముద్రం 169, బొమ్మనహాళ్ 166, తాడిపత్రిలో 164 మంది జ్వరబాధితులను గుర్తించారు.

శ్రీసత్యసాయి జిల్లా: ధర్మవరంలో 694, హిందూపురం 676, మడకశిర 396, కదిరి 286, రొద్దం 274, ముదిగుబ్బలో 272 మందిని గుర్తించారు.



లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి

చలి, ఉన్నట్టుండి జ్వరం, తలనొప్పి వచ్చి.. కొన్ని గంటల తరువాత ఆగి.. మళ్లీ వస్తే మలేరియాగా నిర్ధారించవచ్చు. జ్వరంతో పాటు నడుము, తీవ్రమైన కండరాల నొప్పి, ఆకలి మందగించడం, నోరు రుచిలేకపోవటం, ఆయాసం, కడుపునొప్పి, బీపీ తగ్గడం తదితర లక్షణాలుంటే డెంగీగా పేర్కొనవచ్చు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, కళ్లు మబ్బులు కమ్మటం, చర్మం పొడిబారడం.. తదితర లక్షణాలు అతిసారాన్ని సూచిస్తాయి. జ్వరం లక్షణాలు ఉండి తగ్గకపోతే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

- భీమాసేనాచారి, హెచ్‌వోడీ, జనరల్‌మెడిసిన్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు

జ్వర బాధితులు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వ్యయప్రయాసలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రులతో పాటు సర్వజన వైద్యశాలలో అన్ని సేవలు అందించేందుకు తగిన సౌకర్యాలు ఉన్నాయి. పీహెచ్‌సీ, సామాజిక ఆసుపత్రుల్లో రక్తపరీక్షలు సైతం చేస్తారు. జ్వరాలకు సంబంధించిన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు పనివేళల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించాం. ఏఎన్‌ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి జ్వరబాధితుల వివరాలు నమోదు చేయడంతో పాటు ఆసుపత్రులకు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించాం.

- డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో, అనంతపురం

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా ప్రజాపరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రెండో సమావేశం నిర్వహిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు జడ్పీ హాలులో నిర్వహించనున్న ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. అన్ని శాఖల అధికారులకు బదిలీలు జరిగాయి. రెండు జిల్లాల్లో మొత్తం 90 శాతం మంది అధికారులకు బదిలీలు జరిగాయి. ఈ సమావేశంలో పరిచయ కార్యక్రమాలు, వ్యవసాయం, రహదారులపై ప్రధాన చర్చ జరిగే అవకాశముంది. గతంలో చేసిన ప్రతిపాదనల అమలు తీరును కూడా సమీక్షించే అవకాశం ఉంది. జడ్పీ సర్వసభ్య సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఇన్‌ఛార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు.

వర్షం తగ్గుముఖం

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : జిల్లాలో మూడ్రోజులుగా ముసురు నెలకొన్నా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. గురువారం రాత్రంతా జడివాన కురిసింది. శుక్రవారం పగలంతా ఎండ కాయడంతో పొడి వాతావరణం నెలకుంది. పంటలు తొలగించిన అన్నదాతలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షం పరిశీలిస్తే పెద్దవడుగూరు మండలం మినహా జిల్లా అంతటా చిరుజల్లుల నుంచి భారీ వర్షం కురిసింది. సగటున 12.0 మి.మీల వర్షపాతం నమోదైంది. శెట్టూరు మండలంలో 59.2 మి.మీలు అత్యధిక వర్షం కురువగా బ్రహ్మసముద్రంలో 38.2, డి.హీరేహాళ్‌లో 28.6, బొమ్మనహాళ్‌లో 21.6, రాప్తాడులో 18.0, కళ్యాణదుర్గం, యల్లనూరు మండలాల్లో 16.8 మి.మీల చొప్పున, వజ్రకరూరులో 16.2, గుమ్మఘట్టలో 15.6, కంబదూరులో 14.0, ఉరవకొండలో 13.6, గార్లదిన్నెలో 11.4, కూడేరులో 11.2, కణేకల్లులో 10.0 మి.మీల చొప్పున వర్షం కురిసినట్లు జిల్లా ముఖ్య ప్రణాళికశాఖ అధికారి అశోక్ తెలిపారు.

'తల్లీబిడ్డ మరణిస్తే వైద్యులదే బాధ్యత'

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: తల్లీబిడ్డల మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులదే బాధ్యత అని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మాతా, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఏ శిశువు జన్మిస్తూ మరణించకూడదు.. ఏ తల్లి జన్మనిస్తూ మృతి చెందకూడదన్నారు. కారణాలు ఏమైనా సరే.. మరణాలు మాత్రం నమోదు కావడానికి వీలులేదన్నారు. ప్రతి గర్భిణిపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని, వారికి సకాలంలో అన్ని రకాల వైద్య చికిత్స అందించాలని, నవజాత శిశువుల ఆరోగ్యంపై కూడా పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు, ఇతర నర్సింగ్ సిబ్బంది కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెరుగైన ఆరోగ్యం కోసం తాజా ఆకుకూరలు, కూరగాయలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సర్వజనాస్పత్రి గైనకాలజిస్టులతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ డాక్టర్లకు తగిన అవగాహన తర్ఫీదు ఇప్పించాలన్నారు. మునగాకు తరచూ తీసుకుంటే వచ్చే ప్రయోజనాలపై తయారీ చేసిన ప్రచార పత్రాలను కూడా విడుదల చేశారు.

'అగ్నిపథ్'తో ఉద్యోగావకాశాలు



సదస్సులో వైమానిక దళ అధికారులు సందీప్ సురేంద్రసింగ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్, తదితరులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: అగ్నిపథ్ పథకం ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని వైమానికదళ అధికారులు సందీప్, సురేంద్రసింగ్ పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, వైమానికదళం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్, ఎస్కేయూ డిగ్రీ కళాశాలల్లో అగ్నివీర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ ఉద్యోగ నియామక ప్రక్రియ జరుగుతుందన్నారు. సైనిక రంగ ఉద్యోగంలో చేరడం వల్ల దేశసేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. దేశ రక్షణరంగంలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఇందులో చేరినవారికి నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవ చేసే గుణం అలవడుతాయన్నారు. అగ్నివీర్‌లో వైమానిక ఉద్యోగాలకు 17.5 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పీవీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి అండర్-19 పాఠశాల క్రీడల ఎంపిక పోటీలు

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి అండర్-19 విభాగం వివిధ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సమాఖ్య కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 20న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక కొత్తూరు జూనియర్ కళాశాల మైదానంలో, టెన్నిస్, సాఫ్ట్‌టెన్నిస్ ఎంపిక పోటీలు రుద్రంపేట సమీపంలోని ఊట్ల టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తారు. త్రోబాల్, టెన్నికాయిట్, క్యారమ్స్ జట్ల ఎంపిక 23న, సైక్లింగ్, మాల్కమ్ జట్ల ఎంపిక 24న కొత్తూరు జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఈ నెల 25న ఆర్చరీ జట్లను విద్యాలక్ష్మి ఓరియంటల్ పాఠశాలలో, 26న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఈ నెల 30న ఈత పోటీలు అనంతలక్ష్మి అంతర్జాతీయ పాఠశాలలోని ఈత కొలనులో, నవంబరు ఒకటిన జిమ్నాస్టిక్స్, బాక్సింగ్ జట్ల ఎంపిక డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరుగుతుందని ఆయన వివరించారు. క్రీడాకారులు తమ ప్రవేశ ఫారాలు, వయసు ధ్రువీకరణతో హాజరు కావాలని సూచించారు.

హాకీ.. చిన్నారులు చలాకీ



జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి పతకాలు అందుకున్న అర్చన, అఖిల్, శ్రుతి, సౌమ్య

- జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు
- ఉచితంగా శిక్షణ ఇస్తున్న యువకుడు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన చిన్నారులు హాకీ క్రీడలో సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు, ప్రశంసలు అందుకుంటున్నారు. హాకీ క్రీడకు పూర్వ వైభవం తేవాలని.. గ్రామీణ క్రీడారత్నాలను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పట్టణానికి చెందిన అక్రమ్‌బాషా చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈయన ప్రస్తుతం బెళుగుప్ప మండలం నరసాపురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రోజూ 60 నుంచి 70 మంది బాలబాలికలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. వీరిలో 16 మంది బాలికలు, 20 మంది బాలురు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని పతకాలు అందుకున్నారు. ఇప్పటికే కళ్యాణదుర్గం నుంచి పలువురు బాలికలు అనంతపురంలోని హాకీ అకాడమికి ఎంపికయ్యారు. దిల్లీలో జరిగిన ఖేలో ఇండియా హాకీ క్రీడల్లో నలుగురు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం.

భారత జట్టులో ఆడాలన్నదే లక్ష్యం



కళ్యాణదుర్గానికి చెందిన **సనతాజ్** ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తండ్రి కూలీ పనులు చేస్తూ కుమార్తెను చదువులో, క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. బాలిక రెండేళ్లుగా హాకీలో తర్ఫీదు పొందుతోంది. రాష్ట్రస్థాయిలో రెండుసార్లు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. భారత జట్టు తరఫున ఆడాలని, అదే జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే తన ధ్యేయమని చెబుతుంది.

ఊరికి మంచి పేరు తేవాలని..



పట్టణానికి చెందిన **మహేశ్వరి** కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బాలిక చదువులో రాణిస్తూనే హాకీలో సాధన చేస్తుంది. జూనియర్ బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొని విజేతగా నిలిచింది. జాతీయ స్థాయిలో రాణించి తల్లిదండ్రులకు, సొంతూరుకు మంచి పేరు తెస్తానని ధీమాగా చెబుతుంది.

పేద పిల్లలను ప్రోత్సహించాలని..




హాకీ క్రీడను మరింత మందికి నేర్పి జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్నదే నా లక్ష్యం. అందులో భాగంగానే మూడేళ్లుగా పేద పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నా. క్రీడా దుస్తులు, పరికరాలు సొంతంగా ఏర్పాటు చేస్తున్నా. దాతలు, ఆర్డీటీ సంస్థ నుంచి కొంత ప్రోత్సాహం అందుతుంది. నావద్ద శిక్షణ పొందిన బాలబాలికలు జాతీయ స్థాయిలో నలుగురు, రాష్ట్రస్థాయిలో 36 మంది ప్రతిభ కనబర్చడం సంతోషంగా ఉంది. కళ్యాణదుర్గంలో రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించాలన్నది నా కల. **- అక్రమ్‌బాషా, హాకీ శిక్షకుడు**

రాష్ట్రస్థాయిలో మూడుసార్లు విజేత..



సాయిప్రజ్ఞ కళ్యాణదుర్గం బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. నాన్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్. ఏడాదిన్నరగా హాకీ క్రీడలో తర్ఫీదు పొందుతుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మూడుసార్లు విజేతగా నిలిచింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి ప్రజా సేవ చేస్తానని బాలిక చెబుతుంది.

రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటూ..



అఖిల్‌కుమార్ కళ్యాణదుర్గం బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా హాకీలో శిక్షణ పొందుతున్నాడు. తండ్రి ఆటో నడుపుతూ చదువు, క్రీడలో ప్రోత్సహిస్తున్నారు. మూడు సార్లు కళ్యాణదుర్గం తరఫున పోటీల్లో పాల్గొన్నాడు. ఉమ్మడి జిల్లాల స్థాయిలో విజేతగా నిలిచి, ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. దేశస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే తన లక్ష్యమని చెప్పాడు.

బట్రేపల్లి భళా



వాయుగుండం ప్రభావంతో ఈ ఏడాది తొలిసారిగా బట్రేపల్లి జలపాతం పారింది. ఆకాశగంగలా ఎత్తైన కొండబండల్ల నుంచి దూకుతూ చూపరులను మంత్రముగ్ధులను చేసేలా కనువిందు చేస్తోంది. ఈ జలపాతం కదిరి - పులివెందుల రోడ్డు నుంచి కేవలం 800 మీటర్ల లోపే ఉంటుంది. అటుగా వెళ్లే ప్రయాణికులు వాహనాలను రోడ్డుపైనే ఆపేసి సెల్ఫీ చిత్రాలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తలుపుల**

చదరంగంలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు కైవసం చేసుకున్నారు. వివిధ విభాగాల్లో క్రీడాకారులు అద్భుత ప్రతిభను ప్రదర్శించి విజయాలు సాధించారు. అండర్-9 బాలికల విభాగంలో ఆధ్య ప్రథమ స్థానం సాధించింది. అండర్-15 బాలికల విభాగంలో మహేశ్వరి రాష్ట్రస్థాయిలో రెండోస్థానం సాధించింది. అండర్-7 విభాగంలో వాలిత్ అర్జున్ ద్వితీయ స్థానం, మయాంక్ 5వ స్థానం, అండర్-11 విభాగంలో సుహాస్ శ్రీరాం మూడో స్థానం సాధించారు. ఉత్తమ మహిళగా ఎస్. పర్వత్ అవార్డు అందుకున్నారు. అండర్-13 బాలుర విభాగంలో మిస్బా ఆరోస్థానం, హన్సి స్టీఫెన్ ఏడో స్థానం కైవసం చేసుకున్నారు. భరత్ భూషణ్ (9వ స్థానం), ఆదిత్యరెడ్డి (18వ స్థానం), విశ్వనాథ్ (26వ స్థానం)లు రాణించారు. విజయాలు సాధించిన క్రీడాకారులను చెస్ శిక్షకుడు హన్సిస్టీఫెన్, తదితరులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

నవంబరు 10 నుంచి ఆర్మీ నియామక ర్యాలీ

రాయచోటి: కడప డీఎస్‌ఏ స్టేడియంలో నవంబరు 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ నిర్వహిస్తున్నామని నియామక అధికారి కల్నల్ పునీత్‌కుమార్ పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ నియామకానికి దరఖాస్తులు చేసుకుని అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నంద్యాల, బాపట్ల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

కేజీబీవీ ఉద్యోగాలకు ధ్రువపత్రాల పరిశీలన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన ఉద్యోగాలకు అర్హత సాధించిన మహిళా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శుక్రవారం సమగ్రశిక్షా కార్యాలయంలో చేపట్టారు. సీఆర్టీ 20, పీజీటీ 21, పార్ట్‌టైం బోధకులు 16, వార్డెన్ 7, అకౌంటెంట్ ఉద్యోగాలు 4 ఉన్నాయి. అనంతజిల్లా నుంచి 1877 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1:5 నిష్పత్తి ప్రకారం 394 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వారిలో 87 మంది గైర్హాజరయ్యారు. సబ్జెక్టుల వారీగా వేరు వేరు బృందాలు ధ్రువపత్రాలను పరిశీలించారు. సీఆర్టీ తెలుగు 3, ఆంగ్లం 4, గణితం 5, భౌతికశాస్త్రం 4, సామాన్య శాస్త్రం 4, పీజీటీల్లో ఆంగ్లం 5, భౌతిక శాస్త్రం 1, రసాయన శాస్త్రం 4, వృక్షశాస్త్రం 1, జంతు శాస్త్రం 1, సివిక్స్ 4, కామర్స్ 1, ఎంఎల్‌టీ 1, పూర్వప్రాథమిక ఉపాధ్యాయ 2 పోస్టులున్నాయి. సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు సమక్షంలో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ జరిగింది. మౌఖిక, బోధన సామర్థ్య పరీక్షలు నిర్వహించకుండా కేవలం ప్రతిభ ఆధారంగా ఈ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. 1:5 నిష్పత్తి ప్రకారం రాష్ట్ర సమగ్రశిక్షా పథకం కార్యాలయంలో అభ్యర్థుల ఎంపిక చేశారు. రాష్ట్ర కార్యాలయం వారు జిల్లాకు పంపిన జాబితా ప్రకారం అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా సమగ్రశిక్షా అధికారులు పిలిచారు. అర్హత జాబితాలో లేని కొందరు అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు మోపొద్దు!

ఎస్ఈ కార్యాలయం ఎదుట సీపీఎం ఆందోళన



ఎస్ఈ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: ఇంధన సర్దుబాటు పేరుతో ప్రజలపై ట్రూ అప్ ఛార్జీలు మోపడాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ట్రూఅప్ ఛార్జీలను అమలు చేయకూడదని కోరుతూ అనంతపురంలోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం విద్యుత్తు కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని గుర్తు చేశారు. అడ్డగోలుగా హిందుజా కంపెనీకి వైకాపా సర్కారు రూ.1234 కోట్లు చెల్లించిందని ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వం ఇష్టానుసారంగా విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపటంతోనే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్తు శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్‌కు నేతలు అందజేశారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు బాలకృష్ణ, ప్రకాష్‌రెడ్డి, మసూద్ వలి, వెంకటేశ్, రాము, లక్ష్మీనారాయణ, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

అనుకోని ప్రమాదం.. కార్మికుడికి విద్యుదాఘాతం

అశోక్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: తాగునీటి విభాగంలో పని చేసే గౌరీశంకర్ శుక్రవారం విధులు నిర్వహిస్తూ విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. ఇతను కళ్యాణదుర్గం బైపాస్‌లో సమీపంలో నివాసం ఉంటున్నాడు. 20 ఏళ్లుగా పొరుగు సేవల ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా సుభాష్ రోడ్డు నుంచి కమలానగర్‌లో రెండో క్రాస్‌లో తాగునీటి పైపులైను మరమ్మతు పనులు చేస్తున్నాడు. పైపులైను చివరలో నీరు వెళ్లకుండా మూసివేసే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పాత టైర్లు, ట్యూబులు ఉండటంతో వాటిని పక్కకు విసిరేశాడు. టైరులో ఉన్న నీరు, నేలపై తేమ ఉండటంతో విద్యుదాఘాతానికి గురై వెనక్కి పడిపోయాడు. శరీరం కాలి తీవ్ర గాయాలపాలయ్యాడు. కింద పడటంతో తలకూ బలమైన గాయమైంది. తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్మికుడు కోలుకొనే వరకు నగరపాలక అధికారులు వైద్యం అందేలా చూడాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, ఇంజినీరింగ్ విభాగం జిల్లా కార్యదర్శి సంజీవ రాయుడు, పోతులయ్యలు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం



చైతన్య

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండకు చెందిన వైద్య విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన బెంగళూరులో చోటు చేసుకుంది. బాధిత కుటుంబం తెలిపిన వివరాలిలా.. స్థానిక తెదేపా నాయకుడు, రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నర్రా కేశన్న, మాజీ సర్పంచి నర్రా సుజాత దంపతుల కుమారుడు చైతన్య(23) కర్ణాటకలోని శిమొగ్గలో వైద్య విద్య చివరి సంవత్సరం చదువుతున్నారు. ఆ తర్వాత పీజీ చేయాలనే ఆలోచనతో వివరాలు తెలుసుకునేందుకు రెండురోజుల కిందట బెంగళూరు వెళ్లారు. శుక్రవారం వేకువజామున ద్విచక్ర వాహనంలో తన మిత్రుడు, వైద్య విద్యనభ్యసిస్తున్న విడపనకల్లు మండలం ఆర్.కొట్టాలకు చెందిన గోనుగుంట్ల పూర్ణనందతో కలిసి బయటకు బయల్దేరారు. బెంగళూరులోని సజ్జాపూర్‌లో వెళ్తుండగా అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చైతన్యను స్థానికులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని మిత్రుడికి గాయాలయ్యాయి. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా



బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, న్యూస్‌టుడే : వడియంపేట గ్రామ శివారులో తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డుపక్కన కల్వర్టు కాలువలోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌లోని మియాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెల్దుర్తి దగ్గర టైరు పంక్చర్ కావడంతో ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు పంపారు. అక్కడి నుంచి ఖాళీ బస్సులో డ్రైవర్, క్లీనర్ అనంతపురానికి బయలుదేరారు. వడియంపేట గ్రామశివారుకు రాగానే ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అడ్డం రావడంతో బస్సు డ్రైవర్ అత్యంత చాకచక్యంగా తప్పించబోయి బస్సును రోడ్డుపక్కనే ఉన్న కల్వర్టు కాలువలోకి మళ్లించాడు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. బస్సు డ్రైవర్ నిఖిల్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తప్పిన ప్రమాదం



శ్రీకే పల్లి మండలం యర్రంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు పెద్ద ప్రమాదం తప్పింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంగన్‌వాడీ కేంద్రం ముందున్న పెద్ద వృక్షం నేలవాలింది. చిగరజాతికి చెందిన వృక్షాలు కావడంతో నేలకొరిగాయని పని వేళల్లో అయితే చిన్నారులకు అపాయం జరిగేదన్నారు. కేంద్రం ప్రహరీలో ఇలాంటి చెట్లు ఉన్నాయని వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్ల తొలగింపుపై చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకురాలు అలివేలమ్మ తెలిపారు. **- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి**

స్తంభించిన నీటి సరఫరా

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకుల నుంచి ఉరవకొండకు వచ్చే ప్రధాన తాగునీటి పైపులైన్‌లో రేణుమాకులపల్లి సమీపంలో రెండు చోట్ల భారీగా లీకేజీలు ఏర్పడ్డాయి. ఎక్కువ భాగం నీరు అక్కడే పోతుండడంతో పట్టణానికి తాగునీటి సరఫరా స్తంభించింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించి శుక్రవారం మరమ్మతులు చేశారు. శనివారం నీటి సరఫరాను పునరుద్ధరించే దిశగా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

అమ్మో చిరుత..

కళ్యాణదుర్గం (గ్రామీణం): మండలంలోని బోరంపల్లి గ్రామ సమీప పొలాల్లో శుక్రవారం చిరుత మరో సారి కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. ఎటు నుంచి వచ్చి దాడి చేస్తుందో నని బిక్కుబిక్కుమంటున్నారు. చిరుత సంచారం విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ బీట్ అధికారి నాగేనాయక్ తెలిపారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

గొడవలకు దిగితే కఠిన చర్యలు

డి.హీరేహాళ్(రాయదుర్గం పట్టణం), న్యూస్‌టుడే: పాత కక్షలను మనసులో పెట్టుకుని మళ్లీ గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో కల్యం గ్రామానికి చెందిన పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నెల రోజుల కిందట గ్రామంలో రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు దాడులు చేసుకున్నారు. దాంతో ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. ఇరువర్గాలకు చెందిన అందరూ బెయిలుపై విడుదల అయ్యారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగరాదని, ముందస్తుగా వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇకపైనా గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలని పోలీసులు సూచించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీలు.. సమస్యలకు నిలయాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని సీవీవీ నగర్, పాతపేట కాలనీల్లో సమస్యలతో జనం సతమతం అవుతున్నారు. ఈ కాలనీల్లో 1,500కుపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 7వేల జనాభా ఉంది. సీవీవీ నగర్ రోజు రోజుకు విస్తరిస్తోంది. దానికి అనుగుణంగా పైపులైన్లు లేకపోవడంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. శివారు వీధులకు నీటి సరఫరా కష్టంగా ఉంది. ఇక్కడ చాలా వీధుల్లో సీసీ రోడ్లు లేవు. మట్టి రోడ్లు గుంతలు పడ్డాయి. చిన్న వర్షానికే బురదగా మారుతున్నాయి. కొన్ని వీధుల్లో సిమెంటు దారులు ఉన్నా.. మురుగు కాలువలు లేవు. ఇళ్లలోని వృథా నీరు రోడ్లపై పారుతుంది. దాంతో తీవ్ర అపరిశుభ్రత నెలకొంటోంది. పాతపేటలో జలజీవన్ మిషన్ పేరుతో సిమెంటు దారులను ధ్వంసం చేసి, పైపులైన్లు వేశారు. ఆ తరువాత మరమ్మతులు చేపట్ట లేదు. పలు వీధుల్లో నీటి సమస్య ఉంది. పారిశుద్ధ్యం లోపించి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దీన్ని పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు చొరవ చూపుతామన్నారు.



పాతపేటలోని అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో అపరిశుభ్రత

అక్రమ రవాణాకు గేట్లు ఎత్తారు

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో తనిఖీ కేంద్రాలు మూతపడ్డాయి. దాంతో అక్రమ రవాణాకు గేట్లు ఎత్తినట్లయింది. మండలంలోని పలు గ్రామాలు కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్నాయి. గత ప్రభుత్వంలో ప్రధాన రహదారుల్లోని మలయనూరు, బెస్తరపల్లి గ్రామాలతోపాటు నిజవల్లి, వెంకటంపల్లి, కలిమిపాళ్యం, వడ్డేపాళ్యం వద్ద తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అన్నీ మూతపడ్డాయి. దాంతో అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోతోంది. కర్ణాటక నుంచి యథేచ్ఛగా మద్యం తీసుకొస్తున్నారు. ఇక్కడి నుంచి చౌకబియ్యం, ఇతర నిషేధిత వస్తువులను పక్క రాష్ట్రానికి దర్జాగా తరలిస్తున్నారు. బెస్తరపల్లి మీదుగా కర్ణాటకలోని పావగడ హైవే, హొసకోట నుంచి మద్యం జోరుగా రవాణా జరుగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం తనిఖీ కేంద్రాలను తిరిగి వినియోగంలోకి తెచ్చి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



మూతపడిన వెంకటంపల్లి తనిఖీ కేంద్రం

కాసులుంటేనే దాహం తీరేది!

కణేకల్లు, న్యూస్‌టుడే: గత పాలకులు పట్టించుకోకపోవడం, అధికారుల నిర్లక్ష్యం వెరసి మండలంలోని యర్రగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులకు శాపంగా మారింది. త్రీఫేజ్ విద్యుత్తు లేని కారణంగా రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంటు నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఫలితంగా విద్యార్థులు దుకాణాల్లో తాగునీటి ప్యాకెట్లు కొని దాహం తీర్చుకుంటున్నారు. పాఠశాలలో 3 నుంచి 10వతరగతి వరకు 786 మంది విద్యార్థులు ఉన్నారు. త్రీఫేజ్ విద్యుత్తు లైన్, నియంత్రిక కోసం హెచ్ఎం విద్యుత్తు అధికారులను విన్నవించగా రూ.లక్షపైగా ఖర్చు భరించాలని చెబుతున్నారు. నిధులు లేక విద్యాశాఖ అధికారులు మిన్నకుండిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ విషయమై ఏఈఈ-2 భవని శంకర్‌ను వివరణ కోరగా సమస్యను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు.



నిరుపయోగంగా శుద్ధజల యంత్రం

వసతిగృహాల నిర్వహణలో అలసత్వం వద్దు

ఉరవకొండ: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో వార్డెన్లు నిబంధనలు పాటించాలని, వాటి నిర్వహణలో అలసత్వానికి అవకాశం ఇవ్వొద్దని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, ఉరవకొండ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె పట్టణంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలకు చెందిన ఆరు వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మెను అమలును తెలుసుకున్నారు. సదుపాయాలను పరిశీలించారు. కళాశాల బాలికల వసతి గృహంలో భోజనం రుచిగా లేకపోవడంతో పాటు మరుగుదొడ్లు సరిగా లేవని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. బాలుర వసతి గృహాల్లో మరుగుదొడ్లు, ఇతర వసతులు మెరుగు పరచాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి దుర్గాకల్యాణి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శివరామిరెడ్డి, వైద్యులు, ప్రజలు

వజ్రకరూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శివరామిరెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని కొనకొండ గ్రామంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే శివరామిరెడ్డి ప్రారంభించారు. పంచాయతీ, వైద్య సిబ్బంది పరస్పర సహకారంతో నీటి నిల్వలను తొలగించి, గ్రామాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు తేజ, ప్రతిమ, లలితమ్మ, ఉదయ్ పాల్గొన్నారు.

తీగ తొలగింపు

ఉరవకొండ, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పాల్తూరు సమీపంలో విద్యుత్తు నియంత్రిక స్తంభానికి అల్లుకున్న పచ్చని తీగను ఆశాఖ అధికారులు తొలగించారు. శుక్రవారం 'ఈనాడు'లో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన ఫొటో కథనానికి విద్యుత్తు ఏఈఈ సత్యం స్పందించారు. సిబ్బందితో తీగను పూర్తిగా తొలగించారు.

మార్పు వస్తేనే భవిష్యత్తు బాగుంటుంది

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: అనుకోని ఘటనలతో జైలుకు వచ్చిన వారు మీలో మార్పులు వస్తేనే భవిష్యత్తు బాగుంటుందని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి రమ్య అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌జైల్‌ను ఆమె తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలు, భోజనాలను పరిశీలించారు. ఖైదీలతో వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రమ్య

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: కళ్యాణదుర్గంలోని మారెంపల్లి కాలనీ నుంచి పార్వతీనగర్‌లోకి ప్రవేశించే ప్రాంతంలో చెత్త కుప్పలు పేరుకున్నాయి. తక్షణమే తొలగించాలి. **- ప్రసాద్**



పిచ్చిమొక్కలు, చెత్త కుప్పలతో నిండిన రోడ్డు

సమాధానం: శుభ్రం చేయిస్తాం. **- అలీఖాన్, మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి**
- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

సమస్య: ఉరవకొండలోని పదో వార్డులో శిథిలమైన విద్యుత్తు స్తంభాన్ని మార్చాలి. **- రాజేశ్, ఉరవకొండ**

సమాధానం: పరిశీలించి, మరో స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తాం.
- గురుమూర్తి, విద్యుత్తు ఏఈఈ, ఉరవకొండ - న్యూస్‌టుడే, ఉరవకొండ

రోడ్ల మరమ్మతులకు రూ.3.25 కోట్లు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధికి రూ.3.25 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆశాఖ డీఈ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. బొమ్మనహాళ్-కల్లుదేవనహళ్లి రోడ్డుకు రూ.75లక్షలు, హలకుంది-విఠలాపురం రూ.40లక్షలు, డి.హిరేహాళ్- గవిసిద్దేశ్వర రూ.37లక్షలు, సొల్లాపురం-బెళుగుప్ప రూ.46లక్షలు, కలుగోడు- రంగచేడు రోడ్డుకు రూ.20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. విపత్తుల నిర్వహణ కింద 71 కిలోమీటర్ల రహదారుల మరమ్మతులకు రూ.61లక్షలు మంజూరైనట్లు డీఈ వివరించారు.

రీసర్వేలో తప్పులు సరిచేయాలి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే తప్పుల తడకగా ఉందని, గ్రామాల్లో పర్యటించి వాటిని సరి చేయాలని రైతులు తహసీల్దార్ మునివేలుకు విన్నవించారు. శుక్రవారం బొమ్మనహాళ్, ఉంతకల్లు గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. బొమ్మనహాళ్‌లో 15, ఉంతకల్లులో 16 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో డివిజినల్ సర్వేయర్ సూర్యనారాయణరెడ్డి, సర్వేయర్ రవితేజ, రీసర్వే డీటీ లక్ష్మీకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలపై అవగాహన

శెట్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని అడవిగొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రములో శుక్రవారం మాతా, శిశు మరణాలపై సీడీపీవో వనజాఅక్కమ్మ మహిళలకు అవగాహన కల్పించారు. చిన్న అనారోగ్యానికి గురైనా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ విషయంలో అంగన్‌వాడి సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ కార్యకర్త జానకి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శివానంద, మహిళలు పాల్గొన్నారు.

పార్వతీనగర్‌లో విద్యుత్తు కోత

● ఇబ్బందులకు గురైన గార్మెంట్స్ కార్మికులు



ఏఈ బాలచంద్రకి వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని 1వ వార్డుకు చెందిన పార్వతీనగర్‌లో విద్యుత్తు నియంత్రిక పాడైపోవడంతో దాదాపు 18గంటల పాటు సరఫరా లేక ప్రజలు, గార్మెంట్స్ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారుజాము 2 గంటల నుంచి సాయంత్రం దాకా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగిందని ఆ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్తుశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆ శాఖ ఏఈ బాలచంద్రకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రెడీమేడ్ జాబ్‌వర్కర్స్, తెదేపా నాయకుడు బూదూరు తిప్పేస్వామి, బి.రమేశ్, మోహన్, మంజునాథ, మనోజ్ తదితరులు మాట్లాడుతూ మూడేళ్లుగా ఓవర్‌లోడు, లోఓల్టేజీ, విద్యుత్తు అవాంతరాలు తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. దీపావళి పండగ ముందు గార్మెంట్స్ పనులు అధికంగా ఉంటాయని, ఒక రోజు కరెంటు లేకపోతే రూ.500 నుంచి వెయ్యి దాకా గార్మెంట్స్ కార్మికులు నష్టపోవాల్సి ఉంటుందన్నారు. అదనపు విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలని ఏఈకి విజ్ఞప్తి చేశారు.

గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి గ్రామ దేవత కుందుర్పమ్మ అమ్మవారికి పసుపు కుంకుమ, పూలమాలలతో అలంకరించి ఆలయంలో శుక్రవారం సాయంత్రం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో శాంతి నెలకొని అందరూ సంతోషంగా ఉండాలని మొక్కుకున్నట్లు భక్తులు తెలిపారు.



అలంకరణలో కుందుర్పమ్మ

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఉరవకొండ, న్యూస్‌టుడే: పోలీసు సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఉరవకొండ గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఉరవకొండ గ్రామీణ, ఉరవకొండ, కూడేరు పోలీసు సర్కిల్ అధికారులతో ఆయన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కేసుల పరిష్కారంపై సత్వరమే స్పందిస్తున్నామన్నారు. పెండింగ్ కేసుల సంఖ్య బాగా తగ్గిందన్నారు. జూదం, మట్కాతో పాటు ఇతర అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని వివరించారు. వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపడుతున్నామని, నిబంధనలు అతిక్రమించే వారికి ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తున్నామని చెప్పారు. వీటితోపాటు చోరీల నియంత్రణకు రాత్రి పూట గస్తీ సమర్థంగా నిర్వహించేలా పోలీసు సబ్‌డివిజన్‌లోని అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. సమావేశంలో సీఐలు చిన్నగౌస్, శివరాముడు, ఎస్‌ఐలు మురహరి, ఖాజాహుసేన్, శివ పాల్గొన్నారు.



సీఐలు, ఎస్ఐలతో సమీక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

మట్కా నిర్వాహకులకు కౌన్సెలింగ్

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత మట్కా నిర్వాహకులు, ఏజెంట్లకు శుక్రవారం బొమ్మనహాళ్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ, ఎస్సై నబీరసూల్ కౌన్సెలింగ్ ఇచ్చారు. 'ఈనాడు'లో ఈ నెల 15న 'సరిహద్దులో మట్కా జోరు' 16న 'మట్కా ఛత్రం.. బతుకు ఛిద్రం' శీర్షికన వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు గ్రామాల్లో విచారించారు. మట్కా బీటర్లు, కర్ణాటక సరిహద్దులోని నేమకల్లు గేట్ వద్ద పట్టీలు రాసేవారిపై నిఘా ఉంచి అనుమానం ఉన్న పలువురిని పిలిపించి హెచ్చరికలు చేశారు. మట్కా నిర్వాహకులలో నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ అభివద్ధి కమిటీ సభ్యుడొకరు ఉండటం గమనార్హం. కార్యక్రమంలో ఏఎస్సై హనుమంతరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు పాల్గొన్నారు.

నేల కూలిన విద్యుత్తు స్తంభాలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలో కురిసిన భారీ వర్షాలకు మైలాపురం-కొత్తూరు గ్రామాల మధ్య వేదావతి హగరి ఒడ్డున ఉన్న విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు శుక్రవారం నేలకూలాయి. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రైతులు హగరిలో బోర్లు వేసుకుని ఆ నీటిని వ్యవసాయ పొలాలకు వాడుకుంటున్నారు. బోర్లకు ఏర్పాటు చేసిన మూడు విద్యుత్తు నియంత్రికలు, ఐదు స్తంభాలు కూలిపోయాయని రైతులు తెలిపారు. ప్రస్తుతం బోర్ల కింద వరి సాగు ఎక్కువగా ఉంది. ఈ విషయాన్ని ఏఈఈ లక్ష్మిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వర్షం తగ్గిన వెంటనే నియంత్రికలు, స్తంభాలను పునరుద్ధరించి సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు.



మైలాపురం వద్ద కూలిపడిన విద్యుత్తు స్తంభం, నియంత్రిక

దుర్గంలో ఈ-స్టాంపుల కొరత

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. స్టాంపు పత్రాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరగడం లేదు. వెండర్లు ఈ-స్టాంపులు ఇవ్వటం లేదని దస్తావేజులేఖర్లు, తమకు 500కు మించి ఏజెన్సీ నిర్వాహకులు సరఫరా చేయటం లేదని వెండర్లు ఆరోపిస్తున్నారు. పట్టణంలో 8 ఈ-స్టాంపు విక్రయ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో కొందరు దస్తావేజులేఖర్లే ఈ-స్టాంపు విక్రయదారులుగా ఉన్నారు. కర్నూలుకు చెందిన ఏజెన్సీ నిర్వాహకులు డిమాండుకు తగ్గట్లు ఈ-స్టాంపులు ఇవ్వకపోవటంతో వారి రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు లేకుండా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు.

5శాతం కమిషన్ ఇవ్వటం లేదు : ఈ-స్టాంపులను కర్నూలు నుంచి అధిక ఛార్జీలు భరించి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, అవి కూడా 500 షీట్లకు మించి ఇవ్వటం లేదని ఈస్టాంపు వెండర్లు వాపోతున్నారు. ఈ-స్టాంపుల విక్రయాలకు భవన అద్దెలు, కంప్యూటరు, ఆన్‌లైన్ సేవలు తదితరాలను తామే భరించాల్సి వస్తుందన్నారు. వెండర్లకు ఇస్తామన్న 5శాతం కమీషన్ ఇవ్వడం లేదని వారు విమర్శిస్తున్నారు. దాంతో వెండర్లు రెట్టింపు ధరలకు ఈ-స్టాంపులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెట్టింపు ధరకు విక్రయాలు

రూ.10, 20 ఈ-స్టాంపులను రూ.50కు, రూ.50 స్టాంపు పత్రాన్ని రూ.100కు, వంద రూపాయల పత్రాన్ని రూ.150కు విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ధరలు పెంచుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ-స్టాంప్‌ల సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కె.శ్రీనివాసులును వివరణ కోరగా ఈ-స్టాంపుల సక్రమ సరఫరాకు, ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొత్త ఓటర్ల నమోదుపై అవగాహన సదస్సు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: ఓటు హక్కు నమోదుపై కళాశాల విద్యార్థులకు తహసీల్దార్ మునివేలు, ప్రిన్సిపల్ ఎన్.మోహన్‌కుమార్ అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి వివరించారు. కొత్తఓటర్లు జనవరిలోగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బారాయుడు, హనుమంత నాయక్, శంకర్‌లింగ, పవిత్ర, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి శనివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ జయకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వివాహిత ఆత్మహత్య

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని విద్యానగర్‌లో మౌనిక(19) అనే వివాహిత శుక్రవారం ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కళ్యాణదుర్గానికి చెందిన వన్నూరుస్వామి తన అక్క కుమార్తె కంబదూరు మండలం మర్రిమాకులపల్లికి చెందిన మౌనికను ఏడాది కిందట పెళ్లి చేసుకొన్నారు. వారి మధ్య చిన్నచిన్న మనస్పర్థలు ఉండేవి. దానికితోడు ఆమె కడుపునొప్పితో బాధపడుతుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఆమెకు ఏడాదిలోపు వయస్సున్న కుమార్తె ఉంది. పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

కళ్యాణదుర్గం గ్రామీణం: మండలంలోని దాసంపల్లి గంగాధర ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి పెట్రోల్ పోసి నిప్పంటించారు. శుక్రవారం బాధితుడు గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

తప్పిపోయిన చిన్నారి కుటుంబసభ్యులకు అప్పగింత

కణేకల్లు, న్యూస్‌టుడే: ఇంటి నుంచి తప్పిపోయిన మూడేళ్ల చిన్నారిని పోలీసులు అరగంట వ్యవధిలోనే కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక దిగువగేరికి చెందిన మనోహర్ తన కుమారుడు జైదీప్‌ను తల్లి వద్ద వదిలి బెంగళూరుకు వలస వెళ్లారు. చిన్నారి శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయి ఆర్టీసీ బస్టాండు వద్దకు చేరుకొన్నాడు. సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై నాగమధు ఆదేశాలతో కానిస్టేబుల్ సూర్యనారాయణ విచారించారు. చివరికి చిన్నారి ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో స్థానికులు గుర్తించారు. ఏఎస్ఐ ఈశ్వరయ్య చిన్నారిని తీసుకెళ్లి నానమ్మ శాంతమ్మకు అప్పగించడంతో ఉత్కంఠతకు తెరపడింది.

నిర్మించారు.. నీటి సౌకర్యం మరిచారు

కుందుర్పిలోని గ్రామ సచివాలయం-2 వద్ద ఎనిమిది నెలల కిందట ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించారు. నేటికీ నీటి సౌకర్యం కల్పించలేదు. దాంతో నిరుపయోగంగా మారింది. కార్యాలయంలో పని చేస్తున్న మహిళా సిబ్బంది, పనుల నిమిత్తం వచ్చేవారు కాలకృత్యాలు తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లకు నీటి సదుపాయం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, కుందుర్పి

గోడ నిర్మాణం చేపట్టరూ..

రాయదుర్గం పట్టణంలోని చంద్రబాబు నాయుడు పార్కు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. భారీ వర్షాలకు పార్కు గోడ నేలకూలినా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. పశువులు, కుక్కలు, పందులు లోపలికి వస్తున్నాయన్నారు. రాత్రివేళ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. గోడ నిర్మించాలని కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా గోడ పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం**



దుర్గమ్మ ఆలయానికి దారేదీ?

ఉరవకొండ పట్టణంలోని దుర్గా భవాని ఆలయం మీదుగా రామ్‌నగర్ వైపు వెళ్లే ప్రధాన దారిలో తరచూ మురుగునీరు నిల్వ చేరుతుంది. మురుగు దాటి ఆలయంలోకి వెళ్లాల్సి వస్తుంది. దుర్వాసన వస్తుండటంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగులో నడవలేక కొందరు ఆలయానికి రావడమే మానుకున్న పరిస్థితి. సమస్యను పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకు పోగా, పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**



పేదింట క్రీడాకుసుమాలు


కళ్యాణదుర్గం, రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పేద కుటుంబాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అటు చదువులో రాణిస్తూనే.. ఇటు క్రీడల్లో చక్కటి ప్రతిభ చూపుతున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి ప్రశంసలు అందుకున్నారు. ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిత్యం సాధన చేస్తూ ముందుకెళ్తున్న క్రీడాకారుల గురించి కథనం.

హ్యాండ్‌బాల్‌లో సత్తా



కళ్యాణదుర్గం మండలం హులికల్లులో నివాసం ఉంటున్న రైతు కిష్టప్ప, జయమ్మ దంపతుల కుమార్తె **మల్లిక.** స్థానిక ఆదర్శ పాఠశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతోంది. ఆరో తరగతిలో సీనియర్ విద్యార్థులు ఆటలు ఆడుతుండగా వారిని చూసి క్రీడలపై ఆసక్తి పెంచుకుంది. మొదట పరుగు పందెంలో పాల్గొని జోనల్‌స్థాయిలో మొదటి బహుమతి అందుకుంది. ఆ తర్వాత ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో ప్రతిభ చూపింది. విద్యార్థినికి పీడీ శ్రీనాథ్ తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించారు. పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకపోయినా సాధన చేసింది. సామర్లకోట, కదిరి, కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి నైపుణ్యం ప్రదర్శించి జట్టు విజయానికి తోడ్పాటు అందించింది. ఈ ఏడాది హరియాణ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జట్టులో స్థానం దక్కించుకుంది. అక్కడ చక్కటి ప్రతిభను కనబర్చింది. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని విద్యార్థిని చెబుతుంది.

ఫుట్‌బాల్‌లో బంగారు పతకం



రాయదుర్గం మండలం 74ఉడేగోళం గ్రామానికి చెందిన నాగరాజు, రత్నమ్మ దంపతుల కుమారుడు **శివప్రసాద్.** స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్నాడు. ఏడాది కిందట కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ప్రారంభించడంతో అందులో చేరి చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నాడు. ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు తిరుపతిలో ఎన్‌సీసీ విభాగంలో ట్రెక్కింగ్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీలో శివప్రసాద్ మొదటి స్థానంలో నిలిచాడు. ఈ క్యాంపులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి ఐదు బృందాలు పోటీ పడగా ఆంధ్ర 6వ బెటాలియన్ తరఫున బరిలోకి దిగి ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచాడు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని భట్టువానిపల్లి, పి.టి.ఆర్.పల్లి తండా, హులికల్లు, గోళ్ల, ముద్దినాయనపల్లి, కొండాపురం గ్రామాల్లో 'పల్లె పండగ' శుక్రవారం జరిగింది. ఆయా సర్పంచులు, పలు శాఖల అధికారులు, తెదేపా నాయకులు ఆధ్వర్యంలో సరిహద్దు కందకాలు, పండ్ల మొక్కలు నాటారు. భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. **శెట్టూరు:** శెట్టూరు, అనుంపల్లిలో సీసీరోడ్ల నిర్మాణానికి సర్పంచి కుమార్, అధికారులు, నాయకులు భూమి పూజ నిర్వహించారు. **బ్రహ్మసముద్రం:** బ్రహ్మసముద్రం, ఎరడికెర, అజ్జయ్యదొడ్డి గ్రామాల్లో సీసీ రహదారులు, గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నందకిశోర్, మండల కన్వీనర్ శ్రీరాములు, జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, మాజీ ఎంపీపీ వన్నూరుస్వామి, నాయకులు పరమేశ్, వెంకటేశులు, క్రిష్ట, గౌడు పాల్గొన్నారు. **ఉరవకొండ:** ఆమిద్యాలలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూజ చేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిప్రసాద్, తెదేపా నాయకులు పాల్గొన్నారు. **బెళుగుప్ప:** శ్రీరంగాపురం, నక్కలపల్లి గ్రామాల్లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ సూర్యప్రకాశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. **రాయదుర్గం గ్రామీణం:** మండలంలోని మల్లాపురం, గ్రామదట్ల, ఆర్బీవంక గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ కొండన్న ఆధ్వర్యంలో పల్లెపండగ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు వెంకటమ్మ, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మీబాయి, తెదేపా నాయకులు హాజరై భూమి పూజలు చేశారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి



ఇల్లూరులో విచారిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుంట్లలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై అనంతపురం గ్రామీణ డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం విచారణ చేపట్టారు. 15రోజుల కిందట పొలం సమస్యపై రామాంజినమ్మ ఫిర్యాదు చేయడంతో ఖాసీం కుటుంబ సభ్యులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేశారు. అనంతరం అక్కడి నుంచి ఇల్లూరుకు వెళ్లి అక్కడా ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. ఎస్సై గౌస్‌బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వవాహనంపై చింతలరాయుడు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని చింతలరాయుని ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వెంకటరమణస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతపురానికి చెందిన అన్నమయ్య నృత్య కళాకారుల బృందం ఆధ్వర్యంలో చేసిన నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. వేడుకల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

పూజలందుకున్న వెంకటరమణస్వామి →



మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మరుగుదొడ్లకు వెళ్లే మార్గంలో గుంతలు పడ్డాయి. - **హరీష్, ప్రయాణికుడు**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. - **కృష్ణానాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్**

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

వర్షానికి కూలిన ఇల్లు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పెద్దవడుగూరులో శుక్రవారం పూలసాంబశివుడుకు చెందిన నివాస గృహం కూలిపోయింది. మూడురోజుల నుంచి వర్షాలు కురవడం వల్ల పాత ఇల్లు కావడంతో ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈవిషయం గ్రామ వీఆర్వో అనిల్‌కు విషయం తెలియడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.



పడిపోయిన నివాస గృహం

ఆర్‌ఎంపీలపై చర్యలు తీసుకోవాలి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి, గుత్తిఆర్.ఎస్.లలో నిబంధనలు పాటించని ఆర్‌ఎంపీలపై వైద్య,ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్‌ప్రసాద్, సీపీఎం నాయకుడు మల్లికార్జున డిమాండు చేశారు. శుక్రవారం వారు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. గుత్తిలో ఓ ప్రభుత్వ వైద్యుడి పేరుతో ఆర్‌ఎంపీ వైద్యుడు శేఖర్ అక్రమంగా క్లినిక్ నడుపుతుండగా వైద్యఆరోగ్యశాఖ అధికారులు క్లినిక్‌కు సీజ్ చేసినట్లు గుర్తు చేశారు. లక్ష్మీ క్లినిక్‌ను శాశ్వతంగా మూసివేయాలని వారు కోరారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ విద్యార్థి విష్ణువర్ధన్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెలలో చివర ఏపీలో చదువుతున్న విష్ణువర్ధన్ ఇటీవల జరిగిన అంతర్ యూనివర్సిటీ పోటీల్లో ప్రతిభ చాటుకున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన అయన్ను శుక్రవారం కళాశాల ఎండీ రఘునాథరెడ్డి, కరస్పాండెంట్ వీణ పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి అభినందించారు.

విత్తన విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: వేరుసెనగ విత్తన విక్రయాల యజమానులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు. కల్లూరు గ్రామంలో వేరుసెనగ విత్తన విక్రయాలకు సంబంధించిన గోదాములను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు.

తెదేపా హయాంలోనే రైతులకు మేలు

గుంతకల్లు గ్రామీణం : తెదేపా హయాంలోనే రైతులకు మేలు జరుగుతుందని గుమ్మనూరు నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో మండల వ్యవసాయాధికారిణి కె.స్వాతి ఆధ్వర్యంలో రాయితీ పప్పు సనగ విత్తనాల రైతులకు అందజేశారు. రైతు సేవా కేంద్రాల్లో రాయితీ పప్పు సనగ విత్తనం అందుబాటులో ఉందన్నారు. మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, న్యాయవాది కృష్ణారెడ్డి, మస్తానప్ప, పాల మల్లిఖార్జున పాల్గొన్నారు.

శివారు కాలనీలు.. ప్రగతి ఎరగవు

■ ఇప్పటికీ మట్టిదారులే దిక్కు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులోని శివారు కాలనీలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. పలు కాలనీల్లో కొన్ని వీధుల్లో సీసీరోడ్లు, కాలువలు లేవు. మట్టిరోడ్లతోనే కాలనీవాసులు అవస్థ పడుతున్నారు. కాలనీలు ఏర్పడి ఏళ్ల గడుస్తున్నా అరకొర సౌకర్యాల మధ్యనే కాలం గడపుతున్నారు. వర్షకాలం వచ్చిందంటే గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. పాదచారులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో శివారు కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టలేదు.

మున్సిపాలిటీ: గుంతకల్లు
కాలనీలు: 4
జనాభా : 20 వేలు
ప్రధాన సమస్యలు: సీసీరోడ్లు, డ్రైయిన్లు

ఏ వీధికెళ్లినా అంతే

● కసాపురం రోడ్డు ప్రాంతంలోని మార్కేండేయ కాలనీ 2006లో ఏర్పాటైంది. ఇక్కడ జనాభా పెరుగుతోంది. కాలనీ విస్తరిస్తోంది. సీసీరోడ్లు లేవు. ఈ కాలనీలో అన్ని మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. వర్షాలకు రహదారులు కోతకు గురై ఎగుడుదిగుడుగా మారాయి. ఇదే కాలనీ పక్కన



మార్కేండేయ కాలనీలో సీసీరోడ్డుకు నోచని ప్రధాన రహదారి

■ కాలువలు లేక రోడ్లపై మురుగు

పీరిమిడి కేంద్రం ఏరియాలో అన్ని కంకర రోడ్లే ఉన్నాయి.

● ఆలూరు రోడ్డు పక్కన ప్రశాంతి నగర్‌లో మట్టిరోడ్లే ఎక్కువగా ఉన్నాయి. సీసీరోడ్లు అరకొరగానే కనిపిస్తున్నాయి. రెండు రోజులుగా వర్షం రావడంతో మట్టిరోడ్లు బురదమయంగా మారుతున్నాయి. లాగేజీ ఆటోల టైర్లు బురదలో దిగుబడి పోతున్నాయి. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● ఒకటో వార్డు నాయీబ్రాహ్మణ కాలనీలో కాలువల నిర్మాణాలు పూర్తి చేయలేదు. మురుగు ఇళ్ల వద్దే నిలిచిపోతోంది.

వర్షాకాలంలో ఇబ్బందులు

నాయీ బ్రాహ్మణ కాలనీలో కొంత వరకు కాలువ నిర్మాణం చేపట్టారు. ఫలితంగా మురుగు రోడ్లపై ఉంటోంది. వర్షా కాలం కావడంతో పరిస్థితి దారుణంగా ఉంది. పురపాలక అధికారులు స్పందించాలి. - **రాజేష్, నాయీ బ్రాహ్మణ కాలనీ**

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

శివారు కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. సీసీరోడ్లు విషయమై కొత్త కమిషనర్ అడిగారు. వీలైనంత త్వరగా కాలనీల్లో ప్రగతి పనులకు మోక్షం కలుగుతుంది.

- **హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం**

పరిహారం పంపిణీలో అన్యాయం

● జేసీకి బాధిత రైతుల ఫిర్యాదు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : 2024 ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, వేరుసెనగ పంటలు అకాల వర్షాల కారణంగా నీట మునిగాయి. నెలగొండ గ్రామంలో ఆగస్టులో కురిసిన వర్షాలకు తుది దశలో ఉన్న కంది, వేరుసెనగ పంటలు సాగు చేసిన పొలాల్లో వర్షం నీరు చేరడంతో దాదాపుగా 50 నుంచి 60 మంది రైతులు నష్టపోయారు. పంటలు నష్టపోయిన రైతులు అధికారులను ఆశ్రయించగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి జాబితాను సిద్ధం చేస్తామని అప్పట్లో వెల్లడించారు. వారం రోజుల కిందట ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం కింద కంది, వేరుసెనగకు రూ.13 వేలు, రూ.17 వేలను అందజేయగా జాబితాలో నెలగొండలో కేవలం 11 మంది రైతుల వివరాలు మాత్రమే పొందుపరిచారు. ఈగ్రామంలో 50 నుంచి 60 మంది దాకా రైతులు నష్టపోతే 11 మందికి నష్ట పరిహారం అందడంతో రైతులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నష్టపోయిన రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపకుండా స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. దీనిపై మండల వ్యవసాయధికారిణి కె.స్వాతి వివరణ కోరగా పంట నష్టపోయిన రైతుల వివరాలు అందజేశామని, వారికి నష్టపరిహారం అందిందన్నారు. నెలగొండ గ్రామస్థుల ఫిర్యాదుపై ఇంకా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు.



నీట మునిగిన పంటలను చూపుతున్న మహిళా రైతు (పాతచిత్రం)

ఎకరా పంట నష్టపోయా

-దేవర సంజప్ప

గ్రామంలో సర్వే నంబరు 29లో ఎకరా విస్తీర్ణంలో కంది పంట రూ.10 వేలు ఖర్చు చేసి సాగు చేశా. వర్షాలకు పంట నీట మునిగి నష్టపోయా. గ్రామంలో కొందరికి మాత్రమే పరిహారం అందింది. అధికారులు విచారించి పరిహారం అందజేయాలి.

జాబితాలో పేరు లేదు

-వడ్డే కదిరప్ప

5.03 ఎకరాల పొలంలో కంది సాగు చేశా. వర్షం కారణంగా నష్టం వచ్చింది. విషయం స్థానిక అధికారులకు చెప్పా. గ్రామంలో కొంతమందికే పరిహారం ఇచ్చారు. మాకు అన్యాయం జరిగింది. అధికారులు స్పందించాలి.

విద్యుత్తు సమస్యపై నిలదీత

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రస్తుతం విద్యుత్తు సమస్య తలెత్తకుండా చూడాలని, వర్షాలు పడినప్పటికీ సతమతమవుతున్నామని సభ్యులు అధికారులను నిలదీశారు. పెద్దవడుగూరు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా విద్యుత్తు ఏఈ షఫీఉద్దీన్ మాట్లాడుతుండగా సభ్యులు ముందుగా తమగ్రామాల్లో విద్యుత్తు సమస్య రాకుండా చూడాలని చింతలచెరువు, తెలికి, మేడిమాకులపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. త్వరలోనే సమస్యను పరిష్కారం చూపుతామని ఏఈ సమాధానమిచ్చారు. ప్రస్తుతం రీ-సర్వే గ్రామాల్లో గ్రామసభలు జరుగుతున్నాయని, ఆయా గ్రామాల్లోని రైతులకు భూసమస్యలపై సత్వర పరిష్కారం పొందవచ్చునని తహసీల్దారు ఉషారాణి సూచించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎం, వెలుగు ఏపీఎం, ఐసీడీఎస్, విద్య, వైద్యం, తదితరశాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని ప్రగతిని వివరించారు. జడ్పీటీసీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, తహసీల్దారు ఉషారాణి, ఎంపీడీవో బారెన్‌సాహెబ్, ఈవోఆర్‌డీ నరసింహారెడ్డి, విద్యాధికారి రాముడు, ఏపీవో పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు ఉషారాణి



నాక్ బృందంతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

అక్రమాలు నిగ్గు తేల్చండి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, వాటిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, పలువురు తెదేపా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడిపత్రి పరిసరాల్లోని సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేస్తున్న ధర్నాకు జేసీ, తెదేపా నాయకులు సంఘీభావం తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కళాశాల తనిఖీ కోసం వచ్చిన నాక్ బృందానికి అక్కడి అక్రమాలపై జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. విచారణలో నిజాలని తేలితే చర్యలు తప్పవని నాక్ బృందం చెప్పడంతో ధర్నా విరమించారు. ఈకార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారులపై ఛార్జీల భారం తగదు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : వినియోగదారులపై విద్యుత్తు ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ప్రజలపై ట్రూ అప్ ఛార్జీలు భారం వేసేందుకు విద్యుత్తు మంత్రి మండలి ప్రజా వ్యతిరేక సమ్మతి చేపట్టడంతో దాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం గుంతకల్లు పట్టణంలో ఆలూరు రోడ్డులో విద్యుత్తు కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.



నిరసన చేపట్టిన సీపీఎం నాయకులు

సమస్యల పరిష్కారంలో విఫలం

పామిడి: పామిడి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గత సమావేశాల్లో ప్రస్తావించిన గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరిస్తే ప్రజాప్రతినిధులకు గ్రామాల్లో విలువ ఉంటుందన్నారు. ఎంపీడీఓ తేజోత్స్న, తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కథల పోటీల్లో తిమ్మాపురం బాలిక ప్రతిభ

గుంతకల్లు, గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : రెండు రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జోత్స్న పంపిన కథ ఉత్తమ కథగా ఎంపికైంది. హైదరాబాదుకు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం వారు గత నెలలలో 'వన రక్షణ'పై కథల పోటీలు నిర్వహించారు. ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన 232 మంది పోటీల్లో పాల్గొన్నారు. వారిలో ఈమె పంపిన కథ ఉత్తమ కథగా ఎంపికయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, తెలుగు పండితుడు చంద్రమోహన్ తెలిపారు. నవంబరు 3న హైదరాబాదులోని రవీంద్రభారతిలో నగదు బహుమతితో పాటు పురస్కారాన్ని విద్యార్థిని అందుకోనుందని వారు చెప్పారు.



జ్యోత్స్న

గుంతల రహదారి



బుక్కరాయసముద్రం నుంచి అనంతపురం కలెక్టరేట్‌కు వెళ్లే చెరువుకట్ట రోడ్డుపై పెద్దమ్మ ఆలయం వద్ద రహదారిపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో గుంతల్లో వర్షం నీరు చేరింది. ఈమార్గంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

- **న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం**

న్యాయమూర్తి దృష్టికి విద్యార్థినుల వెతలు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని వసతిగృహాల్లో సమస్యలు పొగావేశాయి. సమస్యలతో విద్యార్థులు సతమతవుతున్నారు. శుక్రవారం సీనియర్ సివిల్‌జడ్జి కాశీవిశ్వనాథాచారి న్యాయవాదులతో కలిసి హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆయన ఆకస్మికంగా వసతిగృహాలను సందర్శించారు. సమీకృత వసతి గృహంలో 110మంది బాలికలు ఉండగా కేవలం 20 మరుగుదొడ్లు ఉన్నాయి. తమ సమస్యలను విద్యార్థినులు జడ్జికి విన్నవించారు. డైనింగ్ హాల్ పైకప్పు పెచ్చులూడి పడుతోందన్నారు. శిథిలావస్థకు చేరిన పైకప్పును న్యాయమూర్తి పరిశీలించారు. అనంతరం బీసీ బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో న్యాయవాది గంగాధర్‌కుమార్, కోర్టు ఉద్యోగి సాదిక్, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

'చెరువులను నింపాల్సిందే'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గంలోని చెరువులన్నింటిని తుంగభద్ర, హంద్రీనివా నీటితో నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండు చేశారు. చెరువులకు సాగునీరు వదలాలని కోరుతూ పార్టీ చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం నార్పల, బుక్కరాయసముద్రం మండలాలకు చేరుకుంది. ఈకార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఓబులు, నాయకులు నల్లప్ప, బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్య, నాగరాజు, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరు నూతన ఎస్సైగా ఆంజనేయులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై చిన్నరెడ్డెప్ప బదిలీపై అన్నమయ్య జిల్లా కె.వి.పల్లికి బదిలీపై వెళ్లడంతో కంబదూరు మండలంలో ఎస్సైగా పనిచేస్తున్న ఆంజనేయులు ఇక్కడికి బదిలీపై వచ్చారు.



ఆంజనేయులు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కసాపురం పోలీసు స్టేషన్ ఎస్ఐగా వెంకటస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కళ్యాణదుర్గంలో కుందుర్పి పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.



వెంకటస్వామి

పట్టపగలే వీధుల్లో దొంగలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో శుక్రవారం పట్టపగలే బైకు దొంగతనం జరిగిన ఘటన శుక్రవారం జరిగింది. స్థానిక ప్రసాద్ ఆసుపత్రికి పక్కవీధిలో వలీ అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనాన్ని తన ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. దాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈదృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. ఆ తర్వాత కొంది సేపటికే దొంగలు వాహనాన్ని పక్క వీధిలో వదిలేసి వెళ్లిపోయారని బాధితుడు తెలిపారు. దీనిపై వివరణ కోరగా దొంగలకోసం గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ వివాహిత మృతి

గార్లదిన్నె, న్యూస్‌టుడే: పెనకచర్ల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లవీ బాయి(25) తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పల్లవీ బాయి భర్తతో పాటు ఈ నెల 14న ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపుతప్పి కిందికి పడడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

కొడవలితో దాడి

గార్లదిన్నె : ఎగువపల్లి గ్రామానికి చెందిన ఆశ్వర్థరెడ్డిపై అదే గ్రామానికి చెందిన నల్లప్ప రెడ్డి కొడవలితో దాడి చేసి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి గ్రామంలో ఉన్న ఆశ్వర్థరెడ్డిపై దాడి చేయడంతో గాయపడ్డాడు. చికిత్స కోసం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వరి పంట నార విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి విచారణ చేపట్టారు.

అనుమానాస్పదస్థితిలో బిహార్ వాసి మృతి

పెద్దవడుగూరు : బుల్లెట్ వాహనాలను కంటైనర్‌లో తరలిస్తున్న బిహార్‌కు చెందిన డ్రైవరు అఖిలేష్ కుమార్‌రాయ్(36) అనుమానాస్పదస్థితిలో మృతిచెందారు. శుక్రవారం పెద్దవడుగూరు మండలంలోని గుత్తిఅనంతపురం సమీపంలో ఉన్న 44వ జాతీయ రహదారిపై పోలీసులు గుర్తించారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు బిహార్ రాష్ట్రం సంస్థీపూర్ జిల్లా బీషన్‌పూర్ తేర్ గ్రామానికి చెందిన అఖిలేష్ కుమార్‌రాయ్ వృత్తిరీత్యా డ్రైవరుగా పని చేస్తున్నారు. కపూర్‌డీజిల్ గ్యారేజీ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు యజమాని ద్వారా బిహార్ నుంచి హోసన్‌కు బుల్లెట్ వాహనాలను కంటైనర్ తీసుకెళ్తుండగా గుత్తిఅనంతపురం వద్దకు రాగానే వాహనం ఆపి నిద్రపోయాడు. ఆ సమయంలో గుండెపోటు వచ్చి మృతిచెందాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? లేకపోతే ఎవరైనా హత్యచేసి వెళ్లారా అనే విషయాలు తెలియాల్సి ఉంది. అఖిలేష్‌కుమార్‌రాయ్ చరవణి ఎంతకపోవడంతో పని చేయకపోవడంతో ట్రాన్స్‌పోర్టు యజమాని జీపీఎస్ ఆధారంగా ఎక్కడున్నాడో కనుక్కునేందుకు తెలిసిన వాళ్లను పంపాడు. వారు చేరుకొని అచేతనా స్థితిలో ఉన్న డ్రైవర్‌ను చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడి తమ్ముడు చందన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయండి

తాడిపత్రి : తాడిపత్రి పరిసరాల్లోని అర్జాస్ ఉక్కు పరిశ్రమ 12 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశ్రమకు చెందిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి పరిసరాల్లో ఉపాధి, భద్రతా నియమాలు బాగున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, చుట్టు పక్కల గ్రామాల అభివృద్ధి విషయంలో చొరవ చూపాలని సూచించారు.

టిప్పర్ల పరికరాలు ధ్వంసం

పామిడి: పట్టణంలోని 44వ జాతీయ రహదారి పక్కన అయ్యప్ప గుడి ఎదురుగా రెండు టిప్పర్ల పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఆ టిప్పర్ల యజమాని చిన్న నరసింహులు తెలిపారు. ఈ ఘటనలో దాదాపు రూ.3.50లక్షల ఆస్తి నష్టం జరిగిందని వాపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఇంటింటి చెత్త సేకరణేదీ?

● రెండేళ్లుగా పంపిణీకి నోచుకోని బుట్టలు

గుత్తి, న్యూస్‌టుడే : గత పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా గుత్తి పురపాలికలో రెండేళ్ల కిందట కొనుగోలు చేసి చెత్త బుట్టలు పంపిణీకి నోచుకోలేదు. ఇంటింటి చెత్తసేకరణ లక్ష్యంతో అధికారులు రూ.25 లక్షలు వెచ్చించి ప్లాస్టిక్ బుట్టలు కొనుగోలు చేశారు. ఇప్పటికీ వాటిని ప్రజలకు పంపిణీ చేయలేదు. ఫలితంగా అనుకున్న లక్ష్యం నీరుగారిపోతోంది.

గుత్తి పురపాలికలోని 13,500 ఇళ్లకు చెత్త బుట్టలు ఇవ్వాల్సి ఉంది. తడి, పొడి, ఘన వ్యర్థాల చెత్త సేకరణకు మూడు బుట్టల చొప్పున ప్రజలకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇంటింటికీ మూడు చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. బుట్టలను తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం పురపాలికల్లో ప్రజలకు పంపిణీ చేశారు. గుత్తిలో మూలనపడేశారు. వార్డు సచివాలయాల్లో వాటిని ఉంచారు. చెత్త బుట్టల కోసం ప్రజలు నిరీక్షిస్తున్నారు. ప్రజలు గంపలు, చాటల్లో తమ ఇళ్లల్లోని చెత్తను చెత్తకుండీలకు చేరుస్తున్నారు.

● గుత్తి, గుత్తిఆర్.ఎస్.తోపాటు చెట్నేపల్లి, సూరశింగనపల్లిలలో అరకొరగా ఇంటింటి చెత్త సేకరణ కొనసాగుతోంది. శివారుకాలనీల్లో అసలు కుండీలు లేవు. కాలనీలకు పారిశుద్ధ్య కార్మికులు వెళ్లడం లేదు.



వాహనంలో చెత్త బుట్టలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

-జబ్బార్‌మియా, కమిషనర్

పురపాలికలో మూలన పడేసిన చెత్తబుట్టలను ప్రజలకు త్వరలోనే ఇస్తాం. బుట్టలు పంపిణీ కాలేదన్న విషయం తనకు తెలిదు. బుట్టలు ఎక్కడెక్కడ నిల్వ చేశారో తెలుసుకుని వాటిని పంపిణీ చేస్తాం. సచివాలయాల వారీగా పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

గార్లదిన్నె, న్యూస్‌టుడే: వర్షాలు కురుస్తుండటంతో పంచాయతీల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు సూచించారు. గార్లదిన్నెలోని పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

గార్లదిన్నె, న్యూస్‌టుడే : బూదేడులో మల్లికార్జున అనే వ్యక్తిపై కొందరు దాడి చేశారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దాడి చేయడం వల్ల బాధితుడు ప్రాణభయంతో ఎమ్మార్పీఎస్ నాయకులను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈమేరకు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

తాడిపత్రి : పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రిలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు చెందిన పాటిల్ హనుంత్ రెడ్డి అనారోగ్యంతో ఉండగా ఆయన వైద్య చికిత్సల కోసం ఖర్చు చేసిన రూ.2,70,400 విలువ చేసే చెక్కును అందజేశారు.

రైతులకు సాగునీరు అందించాలి

తాడిపత్రి, న్యూస్‌టుడే: కరవు సీమలో రైతులకు సాగునీరు అందిస్తే అభివృద్ధి సాధ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర నాయకుడు రాంభూపాల్, ఓబులు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో శుక్రవారం బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, బాలరంగయ్య, కృష్ణమూర్తి, రాజారామ్‌రెడ్డి, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : రీసర్వే జరిగిన గ్రామాల్లో భూసమస్యలు పరిష్కరించడమే లక్ష్యమని ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని సంగాల గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహించారు. గ్రామంలో వైకాపా ప్రభుత్వంలో జరిగిన భూ సర్వేలో సమస్యలను రైతులు అర్జీల రూపంలో అందించగా భూ వ్యత్యాసాలు, జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు పరిష్కరించారు. తహసీల్దారు రామదేవి, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పామిడి, న్యూస్‌టుడే: రీసర్వేలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికే గ్రామ రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శ్రీధర్‌మూర్తి పేర్కొన్నారు. ఇప్పటి వరకు మండలంలోని 10 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని సోరకాయలపేట, నెమళ్లపల్లి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించారు. 19న అప్పాజీపేట, దేవరపల్లి, 21న జి.కొట్టాల, పొగరూరు, 22న రామగిరి, ఎద్దులపల్లి, 23న తంబళ్లపల్లి, రామరాజుపల్లి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శ్రీధర్‌మూర్తి తెలిపారు.

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: రీ-సర్వే చేసిన గ్రామాల్లో రైతులకు చెందిన భూముల సమస్యల కారణంగా సమస్యలొచ్చాయని వాటికి గ్రామసభల్లో పరిష్కారం చూపుతామని తహసీల్దారు ఉషారాణి అన్నారు. తెలికి, చింతలచెరువు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు రైతులతో గ్రామసభలు నిర్వహించారు. రీసర్వే ఉప తహసీల్దారు జయమ్మ, డీఐవోఎస్ సర్వేయర్ నాగరాజు, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో సోమశేఖర్ పాల్గొన్నారు.



సంగాల : గ్రామ సభలో పాల్గొన్న ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దారు రామాదేవి

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

'పరికరాలు లేకుండా రక్షణ ఎలా సాధ్యం?'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు పరికరాలు లేకుండా పని చేసే రక్షణ ఎలా ఉంటుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రెగ్యులర్, పొరుగు సేవల కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. సరెండరు లీవు, పనిముట్లు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ చేసిన కార్మికుల స్థానంలో కొత్తవారిని నియమించాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగభూషణం, నాగరాజు, ఆదినారాయణ, నారాయణస్వామి, ఎర్రిస్వామి, తిరుమలేశ్ పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలపై జరిమానా

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: వేబిల్లు లేకుండా టపాసులు అక్రమంగా రవాణా చేస్తున్నందుకు వ్యాపారిపై అనంతపురం నగరంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రూ.2.5 లక్షలు (రెండు లక్షల, యాభైవేలు) జరిమానా విధించి వసూలు చేశారు. తదుపరి విచారణకు వాణిజ్య పన్నుల శాఖ (నగర సర్కిల్ సీటీఓ) అధికారికి రికార్డులు అప్పగించారు. ఈ వేబిల్లు లేకుండా శివకాశి నుంచి కర్నాటక (బీదర్)కు టపాసులు అక్రమంగా రవాణా చేస్తున్న డీలరు తీరు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. డీలరుతో రూ.2.5 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామని ఆ శాఖ సంయుక్త కమిషనర్ శేషాద్రి తెలిపారు. అనుమతులు లేకుండా విక్రయాలు జరుపరాదన్నారు.



ఎన్టీఆర్ నగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు

నగరంలో భారీ వర్షం

అనంత నగరపాలక, ఈనాడు, అనంతపురం: న్యూస్‌టుడే: నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నాలుగు రోజులుగా తుపాను హెచ్చరికలతో నగరంలోని నడిమి వంక, మరువ వంకతోపాటు పలు ప్రాంతాల్లో పూడిక తీయడంతో నీరు సజావుగా వెళ్లాయి. ఉన్నఫళంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. విద్యుత్తు అంతరాయం ఏర్పడటంతో చీకట్లు అలుముకున్నాయి. భారీ వర్షం వల్ల నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. రాంనగర్, సప్తగిరి కూడలి,

లోతట్టు ప్రాంతాలు జలమయం

జనశక్తినగర్, యువజన కాలనీ, ఉమానగర్, రజకనగర్, వినాయకనగర్, ఎన్జీఓనగర్ తదితర ప్రాంతాల్లో కాలువల్లో నీరంతా ఇళ్ల ముందు నిలబడటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. కాలువల పక్కనే నివాసం ఉంటున్న వారి ఇళ్లలోకి నీరు చేరడంతో పేదలు ఇబ్బంది పడ్డారు. నడిమి వంక పరిసర ప్రాంతాల్లో కాలనీల్లో వర్షం ఆగినా.. పై ప్రాంతాల్లో నుంచి నీరు పెరిగితే ప్రమాదం పొంచి ఉందని రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. వర్షం ఆగిన అనంతరం విద్యుత్తును పునరుద్ధరించారు.



బుక్కరాయసముద్రం వెళ్లే చెరువుకట్ట రోడ్డు దుస్థితి

సమస్యలు తీవ్రం

వర్షాలకు నగర రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయి. గుంతలు భారీగా అంతకంతకు పెరుగుతున్నాయి. నీరు నిలిచి ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.



లక్ష్మీనగర్ నుంచి పీటీసీ మైదానం వెళ్లే దారిలో నిలిచిన వర్షపునీరు

ఎన్ఎస్ఎస్ శిబిరానికి వైద్యవిద్యార్థుల ఎంపిక

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు హరియాణా రాష్ట్రంలోని మీరాపూర్‌వారిలో ఉన్న ఇందిరా గాంధీ యూనివర్సిటీలో భారతదేశ క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరం (నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్)నకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం తరఫున పాల్గొనేందుకు అనంతపురం వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జానకి దివ్యతేజ్, దివ్యసాయిలు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ నుంచి మొత్తం ఆరుగురు ఎంపికవగా ఇద్దరు అనంతపురం వైద్యకళాశాలకు చెందిన వారున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ మాణిక్యరావు

దోమలు.. వణికిస్తున్న వ్యాధులు

● ఎక్కడి చెత్త అక్కడే.. దుర్వాసనతో సతమతం ● అప్రమత్తత పట్టని నగరపాలక యంత్రాంగం



తుపాను తగ్గినా రాంనగర్‌లో తొలగని బురద

అపరిశుభ్రం దుర్వాసన..

రాంనగర్ పట్టణ ప్రణాళిక ఆర్డీ కార్యాలయం దాటిన అనంతరం కొంతభాగం సిమెంటు రోడ్డు ఎత్తుగా ఉండి ఇంకొంత భాగం దిగువకు ఉంది. వర్షం రాగానే పలు ప్రాంతాల్లోని మురుగు నీరంతా ఇక్కడికే చేరి గంటల తరబడి నిలిచిపోతుంది. దీంతో మట్టి అంతా రోజుల తరబడి బురదగా ఉంటోంది. పారిశుద్ధ్యం మెరుగుపడాలంటే లేదు. కనీసం శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడరు చల్లడం లేదు. దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నారు. రాంనగర్‌లోని ఐదు, ఆరు ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది.

న్యూస్‌టుడే: అశోక్‌నగర్

నాలుగు రోజులుగా తెరిపి ఇవ్వకుండా ముసురు కమ్ముకుంది. పలు ప్రాంతాల్లో నీరు ఇంకా నిల్వ ఉంది. రోగాలు విజృంభించే ప్రమాదం ఉన్నా నగరపాలక పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు మాకేం అన్నట్లు ఉన్నారు. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు పెరిగాయి. తేమతోపాటు బురద చాలాచోట్ల ఉంది.

కాలువల్లోని మురుగు సాఫీగా ముందుకు కదలడం లేదు. పారిశుద్ధ్యం మెరుగు అయితేనే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుంది.

● మారుతినగర్‌లో ఈనెల 14న మల్లరాయుడుకు డెంగీ సోకింది. పరిసర ప్రాంతాల్లో, అపరిశుభ్ర వాతావరణం, దోమలు, మురుగు కాలువలు అధ్వానంగా ఉన్న పరిస్థితిపై దృష్టి పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదికాదు. రాంనగర్‌లో ఈ నెల 16న ఓ బాలుడు డెంగీ బారిన పడినట్లు నిర్ధారించారు.

పారిశుద్ధ్యంపై అవగాహన తప్పనిసరి



పాత టైర్లు, టెంకాయ చిప్పలు లేకుండా తొలగించాలి. నీరు నిలబడి దోమలు పెరిగి కుడితే చికెన్ గున్యా, ఇంట్లో మూలల్లో ఉండే దోమలు కుడితే డెంగీ, మురికి నీటిలో ఉన్న దోమవల్ల మలేరియా వచ్చే ప్రమాదం ఉంది. డ్రైడే పాటించాలి. లార్వా దశలోనే దోమలు లేకుండా చేయడానికి గంబూషియా చేపలు, ఆయిల్ బాల్స్, దోమల మందు పిచికారీ చేస్తాం.

- విష్ణుమూర్తి, నగరపాలక ప్రజారోగ్య అధికారి

చెత్త.. చిత్తడి

హౌసింగ్ బోర్డు శివారులో విద్యుత్తు నగర్-కు వెళ్లే దారి పక్కనే చెత్త అంతా పడేస్తున్నారు. తుపాను వల్ల చిత్తడిగా మారింది. సమీపంలోని నివాసాల వారు ఇబ్బంది పడుతున్నారు. తేమ, చెత్త నిల్వ ఉండటంతో పందులకు ఆవాసంగా మారింది.



హమాలి కాలనీకి వెళ్లే దారిలో..

నివాసాల మధ్యనే



వర్షం వచ్చిన అనంతరం నివాసాల మధ్య ఖాళీ ప్రదేశాల్లో నిలబడిన నీరంతా ఇంకి పోవడానికి నాలుగు, ఐదు రోజులు పడుతోంది. ఆలోగా పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. బహుళ అంతస్తులు ఉంటే అందులో ఉన్న వారు వ్యర్థాలు అక్కడే పడేస్తుండటంతో ఆ ప్రాంతం చెత్తకు నిలయంగా మారాయి.

పారిశుద్ధ్య సిబ్బంది: 817	ఇబ్బందికర ఖాళీ ప్రదేశాలు: 230	జనవరి నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ కేసుల నమోదు : 18

ఆటోడ్రైవర్లకు అన్యాయం చేయొద్దు



నిరసన ప్రదర్శనలో ఆటోడ్రైవర్లు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: రాపిడో, ఓలా, ఉబర్ వంటి కంపెనీలు ఆటో డ్రైవర్ల కడుపు కొడుతున్నాయి. వారి స్వార్థం కోసం కార్మికుల జీవనాధారంపై దెబ్బ కొడుతున్నాయని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. శుక్రవారం సీఐటీయూ అనుబంధ భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం సారథ్యంలో అనంత నగరంలో నిరసన ప్రదర్శన, కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. తొలుత పాత ఎమ్మార్వో కార్యాలయం నుంచి నిరసన ర్యాలీగా బయలుదేరారు. అక్కడి నుంచి నగర పురవీధుల నుంచి కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు దాకా సాగింది. ఇక్కడే బైఠాయించి ఆందోళనకు దిగారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, నగర కార్యదర్శి వెంకట నారాయణ మాట్లాడుతూ.. రాపిడో, ఓలా, ఉబర్ వంటి సంస్థలు ఆటో కార్మికుల కడుపు కొడుతూ దోపిడీకి తెర తీశాయని ధ్వజమెత్తారు. ఎందరో ఉన్నత విద్యావంతులు సైతం ఆటోలపై ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. సత్వరమే ఆ కంపెనీలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాగేంద్ర, ప్రకాష్ రెడ్డి, మురళి, రామాంజనేయులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

నగరంలో తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: గంగ : వీక్షణం, **గాయత్రి:** మార్టిన్, **గౌతమి:** జనక అయితే గనక, **గౌరి, ఎస్వీ సినిమాక్స్ :** దేవర, **తరంగిణి :** విశ్వం, **తేజస్విని:** లవ్‌రెడ్డి, **త్రివేణి, నీలిమ:** వేట్టయాన్, **సుధా:** ఇద్దరు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న సింగ్‌నగర్‌లో మురుగు కాలువల్లో పూడిక నిండింది. మురుగు నీరు వెళ్లడం లేదు. **- విమల**

సమాధానం: వెంటనే కాలువల్లో పూడిక తీయిస్తాం.

సమస్య: ఎన్టీఆర్ మార్గ్‌లో హైమాస్ట్ లైట్లు కొన్ని వెలిగితే కొన్ని వెలగడం లేదు . **- నారాయణస్వామి**

సమాధానం: లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపడతాం

(పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దాక్షాయిణి, ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు) – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

బోరు వేసి.. నీటి సరఫరాకు చర్యలు

స్పందనకు వందనం

రుద్రంపేట: రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చైతన్య కాలనీలో ఎన్నికల ముందు బోరుబావి తవ్వి పైపులైన్ ప్రారంభించారు. ఏడాది గడిచినా విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో నీటి సరఫరా జరగలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. 'బోరు వేశారు.. సరఫరా మరిచారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి బోరుబావిని పరిశీలించారు. నీటి సరఫరాకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కళాశాలలపై చర్యలకు డిమాండ్



ఆర్ఐఓ వెంకట రమణ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్కేయూ: ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఆర్ఐఓ వెంకటరమణనాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్ మాట్లాడుతూ. . కొన్ని కార్పొరేట్ జూనియర్ కళాశాలల అధికారులు ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

జేఎన్‌టీయూ: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకోవాలని జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో మూడ్రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. 'మెంబరెన్ ప్రాసెస్ ఫర్ గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్' అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. భూగర్భజలాలు కలుషితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు.

వసతి గృహాల్లో సమస్యలపై తక్షణం చర్యలు

అశోక్‌నగర్: వసతి గృహాల్లోని విద్యార్థినులు ఎదుర్కొనే ఇబ్బందులపై తక్షణమే స్పందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ సూచించారు. అనంతపురంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న బీసీ, ఎస్సీ వసతి గృహాల సముదాయాలను హైకోర్టు ఉత్తర్వుల మేరకు శుక్రవారం పరిశీలించారు. ఏవిధమైన ఇబ్బందులు వచ్చినా అర్జీ రూపంలో ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కార్మికుడికి మెరుగైన వైద్యం అందించండి

అనంతపురం (వైద్యం): కమలానగర్‌లో పైప్‌లైన్ మరమ్మతులు చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుదాఘాతానికి గురై గాయాలతో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికుడు గౌరీశంకర్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని మేయర్‌తోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు నాగేంద్రకుమార్ నాయకులతో కలిసి పరామర్శించారు.

శికారీల జీవితాల్లో వెలుగులు

తపోవనం (అనంత గ్రామీణం): శికారీ జాతుల సమగ్రాభివృద్ధి, చదువుకున్న వారికి వృత్తి నైపుణ్య శిక్షణతో బంగారు బాటలు వేస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ భరోసా కల్పించారు. శుక్రవారం ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలోని ఆడిటోరియంలో జరిగిన పరివర్తన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శికారీల చీకటి జీవితాల్లో వెలుగులు నింపడానికి ఆర్డీటీ, పోలీసు శాఖ, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అమోఘమన్నారు. అనంతరం 14 కుటుంబాలకు తాటిచెర్ల గ్రామస్థులు నిత్యావసరాలు అందజేశారు. నూతన దుస్తులు అందజేసిన కళాంజలికి చెందిన కుమార్, శివలను అభినందించారు. అనంతరం దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, నడక కర్రలు, ఇతర సామగ్రిని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలఫెర్రర్ మాట్లాడుతూ.. పోలీసు శాఖ, దాతల సహకారంతో శికారీల జీవితాల్లో మార్పు తెచ్చామన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

హామీల అమలుకు డిమాండ్

ఆజాద్‌నగర్ (అనంతపురం): ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామిలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో ఏఐఎస్ఎఫ్ మహాసభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించాలని కోరారు. నవంబరు 27 నుంచి 30 వరకు విజయనగరంలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్కేయూ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు ఆర్జేడీ శామ్యూల్‌ను కోరారు. అనంతకు వచ్చిన ఆర్జేడీని ఎస్టీయూ నాయకులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా, రెగ్యులరైజేషన్ వివరాలు విడుదల చేయాలని కోరారు. ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, రామాంజనేయులు, సూర్యుడు పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని అనంతజిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు ఆర్జేడీని కోరారు.

ప్రభుత్వ ఖజానాకు గండికొట్టేవారిపై నిఘా

అనంత నేరవార్తలు: ప్రభుత్వ రాబడికి, ఖజానాకు గండి కొట్టేవారిపై గట్టి నిఘా ఉంచుతామని అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన నగరంలోని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో అధికారులతో సమావేశమై చేపట్టవలసిన విధి విధానాలను గురించి చర్చించారు. పన్నుల ఎగవేత, ఖనిజ, సహజ వనరుల, ఎరువులు, పురుగుమందుల, రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసే నిత్యావసరాల తరలింపుపై నిఘా ఉంచాలన్నారు. పలువురు వ్యాపారులు ప్రభుత్వానికి పన్ను ఎగవేసి రాష్ట్ర ప్రభుత్వానికి మోసం చేస్తున్నారని, వారిపై తరచూ తనిఖీలు నిర్వహిస్తుండాలని సూచించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అర్ధరాత్రి గొలుసు అపహరణ..

రాప్తాడు: రాప్తాడు మండల కేంద్రంలో గురువారం రాత్రి నాగేంద్ర, సావిత్రమ్మ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. సాయంత్రం తన కుమారుడు అరుణ్‌కుమార్‌తో కలిసి భోజనం చేశారు. రాత్రి కావడంతో కింద ఇంట్లో కుమారుడు పడుకోవడంతో భార్య, భర్త మేడపైనున్న ఇంట్లో నిద్రించేందుకు వెళ్లారు. రాత్రి పూట వర్షం పడటం, కరెంట్ పోవడంతో తలుపులు తెరిచి పడుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి వెనుక వైపు నుంచి వచ్చి కింద ఇంటికి తలుపు గడియ పెట్టి, సావిత్రమ్మ మెడలోని తాళిబొట్టు గొలుసు లాగాడు. వెంటనే మెలకువలోకి వచ్చిన ఆమె గట్టిగా కేకలు వేసి పెనుగులాటలో గొలుసు తెగిపోయింది. దొంగ సగం గొలుసుతో పరారయ్యాడు.

కార్బైడ్‌తో పండ్లను మాగబెట్టిన వ్యాపారికి జైలు

అరవిందనగర్ (అనంతపురం): అనంతపురం నగరం మార్కెట్ యార్డులో కార్బైడ్‌తో మాగబెట్టిన రేగు పండ్లను విక్రయిస్తున్న బైగారి అశ్వర్థరెడ్డికి 6 నెలలు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జి శివశంకర్ తీర్పు ఇచ్చారని ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమ్ తెలిపారు. మార్కెట్ యార్డులో 2015 ఆగస్టులో ఫుడ్ సేఫ్టీ అధికారులు జరిపిన తనిఖీలో బీ అశ్వర్థరెడ్డి విక్రయిస్తున్న రేగు పండ్లను నాణ్యత నిమిత్తం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ ప్రయోగశాలకు పంపించారు. మాగబెట్టేందుకు కార్బైడ్ వాడినట్లు తేలింది. అధికారులు అశ్వర్థరెడ్డిపై కేసు నమోదు చేశారని ఆమె తెలిపారు.

పండమేరు కనువిందు



ఈ వారంలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు జలకళ సంతరించుకున్నాయి. రాప్తాడు నుంచి అయ్యవారిపల్లి వెళ్లే దారిలో ఉన్న పండమేరు వంకకు వరదనీరు చేరటంతో మరువ పారి కనువిందు చేస్తోంది. దీనిని చూసేందుకు స్థానికులతో పాటు నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. - **ఈనాడు, అనంతపురం**

అపరిశుభ్రంగా నీటి ట్యాంకు

రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు అపరిశుభ్రంగా మారింది. ట్యాంకు వద్ద పాచి పట్టి, చుట్టూ పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. ట్యాంకు వద్ద నీటి కోసం వెళ్లేవారు జారిపడుతూ గాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేయించి, అపరిశుభ్రతను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాప్తాడు**



ప్రమాదం.. పట్టించుకోరేం?



ఆత్మకూరు మండలం బి.యాలేరు నుంచి తొగరగుంట వరకూ పలు ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం ప్రమాదకరంగా మారింది. రంగంపేట సమీపంలో రోడ్డు ఒకవైపు సాధారణంగా ఉండి మరో వైపు మూడడుగుల లోతు గుంత ఉంది. వాహనదారులు గుంతను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇలానే వదిలేస్తే ప్రాణాలకు అపాయం ఏర్పడే పరిస్థితి ఉంది. **- న్యూస్‌టుడే, ఆత్మకూరు**



భోగినేపల్లిలో వర్షానికి తడిసిన వేరుసెనగ పంటను చూపుతున్న రైతు

రైతు కష్టం.. వర్షార్పణం..

రాప్తాడు, న్యూస్‌టుడే: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వేరుసెనగ పంట అదనుకు రావడంతో రైతులు తొలగించారు. వర్షానికి తడిసి పూర్తిగా దెబ్బతింది. మొలకలు పోతాయని వేరుసెనగను తొలగించడంతో పశుగ్రాసం కూడా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. రాప్తాడు మండలం భోగినేపల్లికి చెందిన వన్నూరప్ప ఐదెకరాల్లో వేసిన వేరుసెనగ పంటను తొలగించారు. మూడ్రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కట్టె పూర్తిగా నల్లగా మారి కుళ్లిపోయే దుస్థితికి వచ్చింది. అదే గ్రామానికి చెందిన గోవిందు అనే రైతు నాలుగెకరాల్లో వేసిన వేరుసెనగ పంటను తొలగించారు. వర్షాలకు తడవంతో కాయలు నల్లగా మారి మొలకలు వచ్చాయి. కంది పంట నేలవాలి పూత రాలిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పశుగ్రాసం కూడా దక్కలేదు

ఐదెకరాల్లో వేరుసెనగ సాగు చేశాను. పంట తొలగించిన తర్వాత వర్షాలకు పూర్తిగా దెబ్బతిని పశుగ్రాసానికి కూడా పనికి రాకుండా పోయింది. పశువులు, 200 గొర్రెలు ఉన్నాయి. వాటికి మేతనైనా కాపాడుకోవాలని తెరపి ఇచ్చినప్పుడు ఆరబెట్టే ప్రయత్నం చేసిన తర్వాత కూడా వర్షం రావడంతో పూర్తిగా దెబ్బతింది. **- రైతు వన్నూరప్ప, భోగినేపల్లి**

ఆదుకోవాలి



నాలుగెకరాల్లో వేరుసెనగ పంటను సాగు చేశాను. పంటను తొలగించిన తర్వాత వర్షాలు కురవడంతో పూర్తిగా దెబ్బతింది. పెట్టుబడులు, పశుగ్రాసం దక్కక పూర్తిగా నష్టపోయాం. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. **- రైతు గోవిందు**



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న శివబాలయోగి ఆశ్రమంలో కలశాల జలాలతో దేవామూర్తులకు కలశపూజ నిర్వహించారు. కలశపూజ చేసిన వాటిని భక్తులు ఊరేగింపుగా తీసుకొని పుణ్య జలాలతో నవగ్రహాలకు, అభయాంజనేయస్వామికి కుంభాభిషేకం చేశారు. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయం ప్రతినిధులు అరవింద్, దేవరాజు, మల్లికార్జున, ప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రగతి బాటన పల్లెలు

. ఆత్మకూరు, న్యూస్‌టుడే: గ్రామాలాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నాయకులు, అధికారులు పేర్కొన్నారు. మండలంలోని తలుపూరు, సింగంపల్లి, సింగంపల్లి తండా గ్రామాల్లో 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా రూ.2.5 కోట్లతో రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనరసింహ తెలిపారు. మొదటి విడతలో మండలంలోని ఆరు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయన్నారు. తలుపూరులో గోకులం షెడ్లకు భూమి పూజ చేశారు.

రాంనగర్ (అనంతపురం): అనంతపురం గ్రామీణం కక్కలపల్లికాలనీ పంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఆరు సీసీ రోడ్లకు రూ.43 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో దివాకర్, సర్పంచి తేజస్విని తెలిపారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పిల్లిగుండ్లకాలనీలో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు.



రాప్తాడు: భోగినేపల్లిలో భూమి పూజ

రాప్తాడు: మండలంలోని భోగినేపల్లిలో 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా పంచాయతీకి సంబంధించిన అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఏపీవో సావిత్రి, సర్పంచి ఉజ్జినప్ప తదితరులు పాల్గొన్నారు.